
ప్రజా
పరిచయ వేదిక
వృత్తిలో ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని,
ప్రతి నిమిషం ప్రజాసేవకై పరితపిస్తూ..
ఎన్నో సందర్భాలలో పేద, బడుగు బలహీన
వర్గాల అభ్యున్నతికై కృషి చేస్తూ...
శ్రీ దగ్గుమళ్ళ ప్రసాదరావు గారు IRS
(చిన్న బుజ్జి) గారు ప్రజలకు మరింత సేవ చేయాలనే
దృఢ సంకల్పంతో, ఎన్టీఆర్ గారి స్ఫూర్తి,
శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి
ఆశయ సాధనకై మన ముందుకు
వస్తున్న సందర్భముగా వారికి ఇవే మా
హృదయపూర్వక శుభాకాంక్షలు
అందరికీ
ఆత్మీయ ఆహ్వానము
నేడు
ది.13-01-2024
ఉదయం
10.00 గం.లకు
మన బాపట్లలోని
విలియం బూత్
జూనియర్ కళాశాల ప్రక్కన,
క్రిస్టియన్ భవన్
ఆవరణములో
శ్రీ దగ్గుమళ్ళ ప్రసాదరావు గారు
IRS (చిన్న బుజ్జి)
దేవతోటి సుందరయ్య
టిడిపి రాష్ట్ర యస్.సి.సెల్ ప్రధాన కార్యదర్శి, చీరాల
దేవతోటి నాగరాజు
పర్చూరు నియోజకవర్గ టిడిపి యస్.సి.సెల్ ప్రధాన కార్యదర్శి
పంతాని మురళీధరరావు
రాష్ట్ర టిడిపి కార్యనిర్వహణ కార్యదర్శి, రేపల్లె
దేవతోటి నాగరాజు
బాపట్ల పార్లమెంట్ టిడిపి యస్.సి.సెల్ ప్రధాన కార్యదర్శి
పెనుమాల డేవిడ్
బాపట్ల పార్లమెంటు టిడిపి యస్.సి.సెల్ అధికారప్రతినిధి
జంగం ప్రవీణ్
బాపట్ల పార్లమెంటు టిడిపి క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు
చుక్కా కోటయ్య
రేపల్లె నియోజకవర్గ టిడిపి యస్.సి.సెల్ అధ్యక్షులు
పల్లం సరోజనీ
టిడిపి బాపట్ల పార్లమెంటు మహిళా ప్రధాన కార్యదర్శి
కూచిపూడి ఝాన్సీరాణి
టిడిపి బాపట్ల పార్లమెంటు కార్యదర్శి
జంగం రాజశేఖరరావు
విశ్రాంత సి.ఇ.ఓ. సంతరావూరు
జి.వి. దాగేశ్వరరావు
టిడిపి ఆఫీస్ ఇన్‌ఛార్జ్, రేపల్లె
వెంకట్రావు
పర్చూరు నియోజకవర్గ క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు
ఇట్లు : బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు మృతి

దాచేపల్లి, జనవరి 12: అప్పుల బాధ తాళలేక కౌలురైతు బలవన్మరణం చేసుకున్న సంఘటన శుక్రవారం దాచేపల్లి మండలంలోని కేశానుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కడియం రవి (32) ఇంట్లోని దూలానికి తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి 10 లక్షలకు పైగా అప్పు వుందని, 3 ఎకరాలలో మిర్చి, 5 ఎకరాలలో పత్తి పంటలు సాగుచేసినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఐదేళ్ల, రెండేళ్ల వయసు కలిగిన పాప, బాబు వున్నారు. దాచేపల్లి ఎస్ఐ సంధ్యారాణి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకాశంలో మరో కొవిడ్ పాజిటివ్ కేసు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 12 : ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మరో కొవిడ్ పాజిటివ్ కేసు నమోదైంది. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన మహిళ మహారాష్ట్రకు వెళ్లి వచ్చారు. అనంతరం ఇంకొల్లులోని తల్లి ఇంటికి చేరుకున్నారు. అనారోగ్యంగా ఉండటంతో ఒంగోలు జీజీహెచ్‌లో పరీక్ష చేయించుకున్నారు. శుక్రవారం వచ్చిన ఫలితాల్లో ఆమెకు పాజిటివ్ అని నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఆమె ఇంకొల్లులోని తన తల్లి ఇంట్లో ఐసోలేషన్‌లో ఉండి చికిత్స పొందుతున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్, ఆర్ఎంవో డాక్టర్ బీ తిరుమలరావు తెలిపారు.

కౌలు రైతుల ఉసురు తీస్తున్న ప్రభుత్వం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జనవరి 12 : రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం కౌలు రైతుల ఉసురు తీస్తుందని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 75వేల మంది కైలు రైతులకురుణాలు అందించామని చెప్పటానికి ఆర్థిక మంత్రి బుగ్గనకు కనీసం సిగ్గు ఉందా? ప్రశ్నించారు. జగన్ ప్రతిపక్షంలో ఉండగా, ముఖ్యమంత్రి అయ్యాక కూడా రాష్ట్రంలో 15 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని, వారందరికీ రైతు భరోసా అందిస్తామని ఇచ్చిన హామీ ఏమై పోయిందని? ప్రత్తిపాటి నిలదీశారు. చిలకలూరిపేటలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ సీసీఆర్‌సీ కార్డుల విధానం అని, ఇప్పటికి మూడు లక్షల మందిని మాత్రమే గుర్తించటం దారుణం అనుకుంటే వారిలో 75వేల మందికే బ్యాంక్ రుణాలు అందించటం దయనీయం అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని బంగాళఖాతంలో కలపటానికి ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని, తెలుగుదేశం, జనసేన కూటమికి అధికారం తథ్యమని ఉద్ఘాటించారు.



పాఠశాల స్థలం కబ్జాకు వైసీపీ నాయకుడి యత్నం

నిర్మాణానికి ఇసుక, కంకర తరలింపు ● ఆక్రమణను అడ్డుకున్న రెవెన్యూ సిబ్బందితో వాగ్వాదం


వైసీపీ నాయకుడు కబ్జాకు యత్నం చేస్తున్న స్థలం వద్ద రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది

నిడుముక్కల(తాడికొండ), జనవరి 12: తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆట స్థలాన్ని కబ్జా చేయడానికి వైసీపీ నాయకుడు విశ్వప్రయత్నం చేస్తున్నారు. స్థలంలో నిర్మాణాలు చేపట్టడానికి శుక్రవారం ఇసుక, కంకరను తరలించారు. దీంతో విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సెక్రటరి సంఘటన స్థలానికి చేరుకొని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించరాదని హెచ్చరించారు. దీంతో రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బందిపై ఆ నేత వాగ్వాదానికి దిగారు. అయితే గత ఆదివారం కూడా ఇదేవిధంగా స్థలం ప్రహరి పగలగొట్టి గోతుల తీయడానికి ప్రయ్నతం చేయటంతో రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. పాఠశాలకు చెందిన భూమిలో నిర్మాణాలు చేపట్టడానికి స్థలం ప్రహరీని పగలగొట్టి పునాదులు తీసి నిర్మాణాలు చేపట్టడానికి చిగురుపాటి వీర రాఘవయ్య సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న వీఆర్వో సంఘటన స్థలానికి చెరుకుని ప్రభుత్వ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు, పనులు చేపట్టరాదని హెచ్చరించారు. హెచ్చరికబోర్డులు పెట్టడానికి ప్రయత్నించిన రెవెన్యూ సిబ్బందితో ఆయన వాగ్వాదానికి దిగి బోర్డులు ఏర్పాటు చేస్తే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించారు. దీంతో రెవెన్యూ సిబ్బంది ఆయనకు నచ్చజెప్పి బోర్డులు ఏర్పాటు చేయమని, ఏదైన ఉంటే తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలన్నారు. వివరాల్లోకి వెళితే తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గ్రామంలో ఉన్న పాఠశాలకు జిల్లా పరిషత్ హోదా కోసం స్థానిక టీడీపీ నాయకులు ప్రయత్నించారు. పాఠశాలకు జడ్పీ హోదా రావాలి అంటే సుమారు రెండు ఎకరాలు ఆట స్థలం కావాలని విద్యాశాఖ చెప్పటంతో సర్వే 259లోని సాముదాయ పోరంబోకు లోని సుమారు రెండు ఎకరాల స్థలాన్ని పాఠశాలకు అప్పటి టీడీపీ ప్రభుత్వం కేటాయించింది. దీంతో నిడుముక్కల పాఠశాలకు జడ్పీ పాఠశాల హోదాను విద్యాశాఖ మంజూరు చేసింది. స్థానిక టీడీపీ నాయకులు ఆ స్థలాన్ని బాగు చేయించి ప్రహరీని నిర్మించారు. కాలక్రమేణ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత జడ్పీ పాఠశాల స్థలాన్ని ఆక్రమించి ఇళ్ల నిర్మించుకోవాలని వైసీపీ శ్రేణులు ప్రయత్నించారు. కాని టీడీపీ నాయకులు చాలా సార్లు ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లారు. అంతేకాకుండా సదరు స్థలం జడ్పీపాఠశాలకు చెందిన భూమి అని హైకోర్టులో పిటీషన్ వేశారు. ప్రసుత్తం ఆ స్థలం కోర్టు పరిధిలో ఉన్నది కాని వైసీపీకి చెందిన వారు స్థలాన్ని ఆక్రమించాలనే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడే విధంగా స్థలాన్ని కేటాయిస్తే దానిని కూడా కబ్జా చేసేందుకు అధికారపార్టీ నాయకులు ఆక్రమణదారులకు అండగా ఉంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులకు పాఠశాల స్థలాన్ని కాపాడాల్సి బాధ్యత ఉన్నదని గ్రామస్తులు తెలిపారు.


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

జాతీయ లోక్ అదాలత్ కక్షిదారులకు గొప్ప అవకాశం

●జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

గుంటూరు సిటీ, జనవరి 12: ఈ ఏడాది మార్చి నెల 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కక్షిదారులకు గొప్ప అవకాశమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి అన్నారు. శుక్రవారం రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు క్యాలెండర్ కార్యకలాపాల్లో భాగంగా జిల్లా కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ రాజీపడదగిన క్రిమినల్ కేసులను, భాగ పంపిణీ కేసులను పరిష్కరించుకోవటానికి జాతీయ లోక్ అదాలత్ చక్కని వేదిక అని అన్నారు. సంవత్సరంలో నాలుగు జాతీయ లోక్ అదాలత్‌లు ఏర్పాటు చేయటం ద్వారా కక్షిదారులకు కేసులు రాజీ చేసుకోవటానికి ధనము కాలము ఆదా చేసుకోవటానికి మంచి అవకాశమని అన్నారు. పెర్మినెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ చైర్మన్ రాంబాబు ఈ సమావేశంలో లోక్ అదాలత్ గురించి తెలియ చేసారు.

నేటి బాలలే రేపటి పౌరులు

నేటి బాలలే రేపటి పౌరులని వాళ్లకు చట్ట సభల గురించి తెలియ చేయటం ముదావహమని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి లీలావతి అన్నారు. అరండల్ పేటలో జరిగిన డిస్ట్రిక్ట్ లెవెల్ బాల పంచాయత్ ఇంటర్ఫేస్ మీటింగ్‌లో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ పిల్లలు న్యాయ సేవాధికార చట్టం, బాలల హక్కుల గురించి తెలుసుకోవాలని వారి చుట్టపక్కలవారికి తెలియ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా బాల పంచాయతీ సభ్యులకు న్యాయ సేవాధికార చట్టం, బాలల హక్కుల గురించి వివరించారు. ఈ సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్పర్సన్ ప్రమీల, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎ గాయత్రీ దేవి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ విజయ్ కుమార్, బచిపన్ బచావో ఆందోలన్ స్టేట్ కోఆర్డినేటర్ తిరుపతిరావు, చైల్డ్ రైట్స్ స్టేట్ ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబీ తదితరులు పాల్గొన్నారు.

పండుగ ప్రయాణం.. కిటకిట

బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ ● సర్వీసులు లేక గమ్యస్థానాలకు వెళ్లేందుకు ఇక్కట్లు



గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు, సీట్ల కోసం ఎగబడుతున్న ప్రయాణికులు

గుంటూరు, జనవరి 12: సంక్రాంతి పండుగకు సొంతూళ్ళకు వెళ్ళేందుకు ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్‌కు క్యూ కడుతున్నారు. పండుగకు నాలుగు రోజులు ముందుగానే ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ కనిపిస్తోంది. హైదరాబాద్, చెన్నై, తిరుపతి, బెంగళూరు వంటి దూర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణీకుల కోసం ఇప్పటికే స్పెషల్ బస్సులను ఏర్పాటు చేశారు. స్పెషల్ బస్సుల్లో సైతం సాధారణ ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ఇప్పటికే ఆర్టీసీ ప్రకటించటంతో ప్రయాణికుల రద్దీ పెరిగింది. గుంటూరు -1, 2 డిపోలతో పాటు పొన్నూరు, మంగళగిరి, తెనాలి డిపోల నుంచి అదనపు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు డీపీటీవో రవికాంత్ తెలిపారు. ముఖ్యంగా కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు సొంతూళ్ళకు వెళ్ళేందుకు పెద్ద ఎత్తున బస్టాండ్‌కు చేరుకుంటున్నారు. ఇప్పటికే విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించటంతో విద్యార్థుల కోలాహలం కనిపిస్తోంది. గుంటూరు నుంచి విజయవాడతో పాటు రాయలసీమ, గోదావరి జిల్లాల నుంచి ఇక్కడకు చదువుల కోసం వచ్చిన విద్యార్థులు పండుగకు సొంతూళ్ళకు వెళుతున్నారు. ఇక శనివారం నుంచి ఉద్యోగుల రద్దీ కూడా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

ప్రయాణికులకు తప్పని ప్రయాణ కష్టాలు...

పండుగ ప్రయాణ కష్టాలు తప్పటం లేదని పలువురు పోతున్నారు. దూర ప్రాంతాలకు అదనపు సర్వీసులు ఏర్పాటు చేసిన అధికారులు జిల్లాలో తిరిగే బస్సుల సంఖ్య పెంచకపోవటంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని వాపోతున్నారు. ముఖ్యంగా గుంటూరు నుంచి బాపట్ల, పల్నాడు ప్రాంతాల వైపునకు వెళ్ళేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లె వెలుగు సర్వీసులకు కోత పెట్టటంతో పాటు సమయానికి బస్సులు లేకపోవటంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఆయా మార్గాల్లో రద్దీకి అనుగుణంగా అధికారులు సర్వీసులు అందుబాటులో ఉంచాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



గుంటూరు రైల్వేస్టేషన్‌లో రైళ్ల కోసం వేచ్చి ఉన్న ప్రయాణికులు, బోగీ వద్ద ప్రయాణికులు

మూడు రాజధానుల ఆలోచన నుండి సీఎం బయటకు రావాలి

తుళ్లూరు జనవరి 12: మూడు రాజధానుల మూర్ఖపు ఆలోచన నుండి సీఎం జగన్ రెడ్డి బయటకు రావాలని రాజధాని అమరావతికి 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు రైతు కూలీలు , మహిళలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1487 వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడారు. ప్రజల మనోభావాలను గౌరవించకుండా సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానులటం నియంత పోకడలకు నిదర్శనమన్నారు. ప్రజా స్వామ్యంలో నియంత నిర్ణయాలు తీసుకుంటే గద్దె దిగాల్సి ఉంటుందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లైనా అమరావతి రాజధాని కట్టలేకపోయింది. మన అధికారంలోకి రాగానే బ్రహ్మాండంగా కడతాం.. అని సీఎం జగన్‌రెడ్డి చేసిన ప్రసంగాలను గుర్తు తెచ్చుకోవాలన్నారు . అధికారంలోకి రాగానే అమరావతిని భ్రమరావతి అని , ముంపు అని, ఎడారని , అనేక అసత్య ప్రచారాలు చేశారన్నారు. మరి ముంపు ప్రాంతం నుండే రాష్ట్ర పరిపాలన గత ఏడేళ్ల నుండి జరుగుతుంది కదా.. పాలకులు మునగలేదే.. దీనికి సమాధానం ఏం చెపుతారన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కల ఆట మానుకోవాలన్నారు. ప్రజల అభీష్టం మేరకు , రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం తీర్పు ప్రకారం అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా ప్రకటించి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

1487 వ రోజుకు రైతుల ఆందోళనలు


తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

అంబేడ్కర్ విగ్రహ సాధనలో 'గోళ్లమూడి'ని గుర్తించాలి

ప్రభుత్వాన్ని కోరిన వివిధ దళిత సంఘాల నేతలు

విజయవాడ, జనవరి 12: విజయవాడ స్వరాజ్య మైదానంలో ప్రారంభించబోతున్న అంబేడ్కర్ విగ్రహ సాధనకు గోళ్లమూడి రాజసుందరబాబు చేసిన పోరాటాన్ని గుర్తించి, ఆయనను తగిన విధంగా సత్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పలు దళిత, గిరిజన, ప్రజా, ఉద్యోగ, అంబేడ్కర్ యువజన సంఘాల ప్రతినిధులు కోరారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడా రు. 2014 నుంచి 2016 వరకు రాజసుందరబాబు నాయకత్వంలో చేసి న నిరంతర పోరాటం కారణంగానే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ స్థాపనపై 2016 మార్చి 19న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిందన్నారు. తర్వాత 2017 ఏప్రిల్ 14న అమరావతిలో టీడీపీ ప్రభుత్వం విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేసిందన్నారు. 2020 అక్టోబరు 9న సీఎం జగన్ స్వరాజ్య మైదానంలో 18 ఎకరాల్లో శంకు స్థాపన చేసి రూ.400 కోట్లతో అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించి జాతికి అంకితం చేయనున్నారన్నారు. చార్వాక యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నం డేవిడ్ విలియమ్స్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బండ్లమూడి స్టాలిన్‌బాబు, వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు సాంబయ్య, ఇద్వా సంఘం నేతలు బేతపూడి భారతి, దారా వెంకటరత్నం పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నేతలు

అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు : డీటీసీ కరీం

గుంటూరు(తూర్పు), జనవరి 12: సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా కాంట్రాక్ట్ క్యారేజ్ నిర్వాహకులు ప్రయాణికుల నుంచి అధికచార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీటీసీ కరీం హెచ్చరించారు. శుక్రవారం టోల్‌ప్లాజా వద్ద ఆయన బస్సులను తనిఖీలు చేశారు. అనంతరం కరీం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజుల నుంచి టోల్ ప్లాజా, పేరేచర్ల జంక్షన్ వద్ద కాంట్రాక్టు బస్సులపై రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి మొత్తం 89 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఇందులో బస్సులో సరుకులు చేరవేసినందుకుగాను 23, ప్రయాణికుల వివరాలు పట్టిక నిర్వహించనందుకు 8, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడిపినందుకు 5, మల్టిటోనడ్ హరన్‌పై 14, మిగతా ఇతర నిబంధనలు పాటించనందుకు 39 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

బిల్డింగ్ పైనుంచి పడి ఒకరి మృతి

ఏలూరు క్రైం, జనవరి 12: బిల్డింగ్‌కు సున్నం వేస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతి చెందిన ఘటన ఏలూరులో శుక్రవారం చోటుచేసుకుంది. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన కె.మరియదాసు(40) కొంతకాలం నుంచి ఏలూరు జిల్లా ఏలూరు తూర్పువీధిలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఒంటరిగా ఉంటూ పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. ఏలూరు వన్‌టౌన్ పరిధిలోని పెయింటింగ్ పనులు చేయడానికి శుక్రవారం ఉదయం వెళ్లాడు. ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి జారి కిందపడి తీవ్రగాయాలకు గురికాక వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

నేడు విశాఖపట్టణానికి ప్రత్యేక రైలు

గుంటూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా శనివారం విశాఖపట్టణానికి ప్రత్యేక రైలుని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు. 08591 విశాఖపట్నం - గుంటూరు రైలు శనివారం ఉదయం 8.20కి బయలుదేరి దువ్వాడ, సామర్లకోట, రాజమండి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ మీదగా మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరు చేరుకొంటుంది. నెంబరు. 08592 గుంటూరు - విశాఖపట్టణం రైలు శనివారం సాయంత్రం 5 గంటలకు బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా రాత్రి 11.50కి విశాఖపట్టణం చేరుకొంటుంది. ఈ రైలులో ఏసీ టూటైర్ ఎకానమి, స్లీపర్ క్లాస్ భోగీలుంటాయని సీపీఆర్‌వో తెలిపారు.

23, 24 తేదీల్లో 'ఐపీ యాత్ర'పై వర్క్‌షాప్

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) నిర్వాహకులకు ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (ఐపీఆర్)పై అవగాహన కల్పించేందుకు కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో విజయవాడలో వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ తెలిపింది. ఇండస్ట్రియల్ డిజైన్స్ కాపీరైట్స్, పేటెంట్స్, ట్రేడ్‌మార్క్, ట్రేడ్ సీక్రెట్స్, జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ (జీఐ) రిజిస్ట్రేషన్స్ తదితర అంశాలపై ఎంఎస్ఎంఈ మంత్రిత్వశాఖ అధికారులు, ఆయా రంగాల నిపుణు లు సలహాలు, సూచనలు ఇచ్చి అవగాహన కల్పించనున్నట్టు వివరించింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ఎంఎస్ఎంఈల మేథోసంపత్తిని ప్రోత్సహించడంతోపాటు దేశ, విదేశాల్లో ఈ-ఫైలింగ్స్ సంఖ్యను పెంచడమే లక్ష్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ 'ఐపీ యాత్ర' పేరుతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ వర్క్‌షాపులో పాల్గొన్నవారికి సర్టిఫికెట్లు అందజేస్తారని ప్రకటించింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

63,634 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 63,634 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 69,258 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 33,872 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8500	20000	334	9000	19000
నెంబరు. 5	11500	18200	నెంబరు. 5	15000	15000
273	12500	14000	273	–	–
341	10000	18000	341	13500	17800
4884	12000	18500	4884	–	–
సూపర్ 10	--	--	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21000	తేజ	9000	15000
బ్యాడిగి	9000	20000	బ్యాడిగి	11000	17000
దేవనూరు డీలక్స్	10000	20000	దేవనూరు డీలక్స్	–	–
తెల్లకాయలు	5000	13000	తెల్లకాయలు	5000	12000







వసూళ్లలో.. వెనుకంజ

- పురాల్లో పన్నులు 38.73 శాతమే
- పేరుకుపోతున్న ఆస్తి, నీటి పన్నులు
- రూ.449.49 కోట్లకు 174.11 కోట్లే వసూలు
- అధికారుల నిర్లక్ష్యంతో వసూలుకాని బకాయిలు
- వసూళ్లలో రాష్ట్రంలో వినుకొండ ప్రథమ, అద్దంకి ద్వితీయ స్థానం

పురపాలక సంఘాలకు ప్రధాన ఆదాయ వనరు.. పన్నులు. ఇలాంటి పన్నుల వసూళ్లలో మున్సిపాలిటీలు వెనుకబడిపోతున్నాయి. పన్నుల వసూళ్లలో కనీస ప్రయత్నం కూడా ఉండటంలేదని ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలైన పన్నులను చూస్తే తెలుస్తోంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో రూ.449.49 కోట్లకు 174.11 కోట్లే వసూలు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మొత్తంమీద పన్నుల వసూళ్ల శాతం 38.73 శాతమని మున్సిపల్ అధికారులు ప్రకటించారు. ఇక ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నా మున్సిపాల్టీల్లోని అధికారులు సరైన రీతిలో స్పందించడంలేదని బకాయిలను చూస్తే తెలుస్తోంది. ఏటికేడు బకాయిలు పేరుకుపోతున్నాయే కాని వాటి వసూళ్లపై అధికారులు దృష్టి సారించడంలేదు. అవినీతి, రాజకీయ ఒత్తిళ్లతో పన్నుల వసూళ్లలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. లక్ష్యాల మేర పన్నుల వసూళ్లు జరగకపోతుండటంతో ఆ ప్రభావం ఉద్యోగుల జీతాలు, అభివృద్ధి పనులపై పడుతోంది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆదాయ వనరులను పెంపొందించుకోవడంలో మున్సిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని పన్నుల వసూళ్లను చూస్తే తెలుస్తోంది. మున్సిపాలిటీల్లో ఆస్తి, నీటి పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి. మున్సిపాలిటీలకు ఇచ్చిన లక్ష్యాల మేర పన్ను వసూలు జరగడం లేదు. సిబ్బంది అలసత్వంతో వసూలు మందకొడిగా సాగుతోంది. ఆస్తి, నీటి, ఇతర పన్నులు రూ.449.49 కోట్లు వసూలు చేయాలి. ఇప్పటి వరకు రూ.174.11 కోట్లు మాత్రమే వసూలు చేశారు. వసూళ్లలో రాష్ట్రంలోనే వినుకొండ ప్రథమ, అద్దంకి మున్సిపాలిటీ రెండో స్థానంలో నిలిచాయి. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలలోని మున్సిపాలిటీ లలో ఆస్తి పన్ను రూ.368.87 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు రూ.157.71 కోట్లు వసూలైనట్లు డీఎంఏ కార్యాలయ లెక్కలు తెలియజేస్తున్నాయి. పన్ను వసూలు శాతం 42.75గా నమోదైంది. నీటి పన్ను వసూలు కూడా నామ మాత్రంగా ఉంది. తాగునీటి పన్ను రూ.80.62 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు రూ.16.40 కోట్లు మాత్రమే వసూలు చేయగలిగారు. నీటి పన్ను వసూలు 20.34 శాతంగా ఉంది. ఉన్నతాధికారులు పన్ను వసూళ్లపై సమీక్షిస్తున్నా మున్సిపాలిటీలలో అధికా రులు, సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. దీంతో జిల్లాలోని మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లలో జాప్యం జరుగు తున్నది. పన్ను వసూళ్ల వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా వారి మొర మున్సిపాలిటీ అధికారులు ఆలకించే పరిస్థితి లేదు. మార్చి ఆఖరు కల్లా సుమారు రూ.211.16 కోట్లు ఆస్తి, తాగునీటి పన్ను రూ.64.22 వసూలు చేయాల్సి ఉంది. గుంటూరు కార్పొరేషన్‌లో దాదాపు రూ.20.36 కోట్లు ప్రభుత్వ సంస్థల భవనాలు, కార్యాలయాలకు సంబంధించిన పన్ను బకాయిలు పేరుకు పోయాయి. సత్తెనపల్లి పురపాలక సంఘంలో ఎఫ్‌సీఐ రూ.3.47 కోట్లు పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉంది. అన్ని పురపాలక సంఘాలలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి.



జీతాలు, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం

నిధుల లేమితో మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల నిర్వహణ, కాంట్రాక్ట్ కార్మికుల జీతాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నది. సకాలంలో పన్నుల వసూళ్ల కాకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకుందనేది బహిరంగ రహస్యం. అయినా అటు అధికారులు ఇటు పాలకులు పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం కూడా మున్సిపాలిటీలను గాలికివదిలేసిందని అందువల్లే ప్రధాన ఆదాయవనరైన పన్నుల వసూళ్లలో వెనుకంజలో ఉన్నట్లు అర్థమవుతుంది. సాధారణ నిధుల నుంచి చేపట్టే పనులకు సంబంధించిన బిల్లులు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులను నిలిపి వేస్తున్నారు.

పన్నుల వసూళ్లలో అక్రమాలు..

ఆస్తి, తాగునీటి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం చూపుతున్న అధికారులు ఇతర పన్నుల వసూళ్లలో అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. మున్సిపాల్టీల్లో ప్రధానంగా ప్రకటనల పన్ను పక్కదారి పడుతోంది. పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రకటనల బోర్డులకు, వాటి పన్నుల వసూళ్లకు పొంతన ఉండటంలేదు. తాత్కాలిక ఆక్రమణలు, ప్రకటనలకు సంబంధించిన పన్నుల వసూలులో అధికారులకు అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రెండు పన్నుల ఆదాయాన్ని పెంచుకోవడంలో అధికారులకు చిత్తశుద్ధి కొరవడింది. తాత్కాలిక ఆక్రమణలు, ప్రకటనల పన్నులకు సంబంధించి ఏటా ఒక్కో మున్సిపాలిటీ లక్షల్లో ఆదాయాన్ని కోల్పోతున్నది. ప్రణాళికా విభాగం పర్యవేక్షణ లేక పోవడం వల్లే ఈ ఆదాయాన్ని మున్సిపాలిటీలు రాబట్టుకోలేకపోతున్నాయి.

మున్సిపాలిటీల వారీగా ఆస్తి పన్ను వసూళ్లు ఇలా...

మున్సిపాలిటీ	వసూళ్ల లక్ష్యం రూ.కోట్లలో	వసూలు రూ.కోట్లలో	శాతం
పల్నాడు జిల్లా			
నరసరావుపేట	14.83	6.99	47.10
చిలకలూరిపేట	14.14	3.84	27.20
వినుకొండ	4.26	3.75	88.20
సత్తెనపల్లి	6.40	2.92	45.70
మాచర్ల	4.90	2.37	48.50
పిడుగురాళ్ల	4.74	2.66	56.10
దాచేపల్లి	1.78	1.17	65.90
గురజాల	1.29	0.59	46.00
బాపట్ల జిల్లా			
రేపల్లె	4.76	2.83	59.40
బాపట్ల	8.14	3.97	48.80
అద్దంకి	3.78	3.05	80.90
చీరాల	10.30	6.73	65.40
గుంటూరు జిల్లా			
గుంటూరు కార్పొరేషన్	231.64	80.03	34.50
పొన్నూరు	5.07	2.95	58.20
మంగళగిరి, తాడేపల్లి	30.62	19.30	62.89
తెనాలి	22.22	11.59	52.10

బరులు.. సిద్ధం

- గ్రామాల్లో పందాలకు సై
- వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఏర్పాట్లు
- కత్తులు దూసేందుకు సిద్ధమవుతోన్న కోళ్లు
- పోలీసు హెచ్చరికలను ఖాతరు చేయని వైనం



వేమూరు మండలం వరహాపురం వద్ద కోడి పందాల కోసం ఏర్పాటు చేసిన బరి



చుండూరు మండలం వేటపాలెంలో బరి ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు



రేపల్లె వద్ద ఏర్పాటు చేసిన బరి వద్ద ఉన్న పోలీసులు

కొల్లూరు, అద్దంకి/బాపట్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి ఇంకా సమయం ఉన్నా.. కోడి పందాలకు బరులు సిద్ధమవుతున్నాయి. కత్తులతో కోళ్లు.. పందాలకు జూదరులు సిద్ధమవుతున్నారు. ఎన్నికల ఏడాది కావడంతో ఈ సారి భారీగానే కోడి పందాలు జరిగేలా నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పందాలకు అనుమతి లేదని పోలీసుల హెచ్చరికలు ఖాతరు చేయడంలేదు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల పరిధిలో కోడి పందాలను భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎక్కడికక్కడ పాలకపార్టీ నేతల కనుసన్నల్లోనే ఈ తంతు జరుగుతుంది. వేమూరు మండలం వరహాపురం పరిధిలో కోడి పందాలు వేసేందుకు బరి దాదాపు సిద్ధమైంది. కొల్లూరు మండలం పెసర్లంక సమీపంలో బరిని ఏర్పాటు చేస్తున్నారు. భట్టిప్రోలు మండలంలో పెదపులివర్రు, ఓలేరు-పేటేరు మధ్యలోని జాతీయ రహదారి వెంబడి భారీ స్థాయిలో బరికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. చుండూరు మండలం వేటపాలెంలో కోడి పందాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. బరుల సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడ సిబ్బందిని ఏర్పాటు చేసినా వారిని పట్టించుకోకుండా ట్రాక్టర్లతో భూమి చదును, బారీకేడ్లు తదితర పనుల్లో నిర్వాహకులు ఉన్నారు. వేమూరు పరిధిలో మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున ఆశీస్సులతో ఆ పార్టీ నాయకులు కోడి పందాలకు బరులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరు సర్కిల్ పరిధిలో కోడి పందాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. నిర్వాహకులు కొన్నిప్రదేశాలను ఎంపిక చేసుకుని జూదరులకు సెల్‌ఫోన్ల ద్వారా సమాచారం ఇస్తున్నట్లు తెలిసింది. అయితే బాపట్ల జిల్లా ఎస్పీ జిందాల్ గురువారం డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎక్కడా కోడి పందాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడైనా కోడి పందాలు జరిగినట్లు సమాచారం వస్తే ఆ పరిధిలో ఉన్న ఎస్‌ఐలను సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు.

సంక్రాంతి సిరులు వెల్లివిరియాలి

- కలెక్టరేట్‌లో అట్టహాసంగా సంబరాలు
- ఉద్యోగులతో కలిసి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

బాపట్ల, జనవరి 12: సంక్రాంతి పండుగతో ప్రతి ఇంట సిరులు వెల్లివిరియాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆకాంక్షించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సంక్రాంతి సంబరాలు వైభవంగా జరిగాయి. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు తెలియజెప్పేలా రోలు, తిరగలి, రోకలి, గోబ్బెమ్మలు, హరిదాసులు, గంగిరెద్దుల ప్రదర్శన, డప్పు కళాకారుల నృత్యాలు, మేళతాళాలతో కలెక్టరేట్ ప్రాంగణం మారుమోగింది. ఉద్యోగులు, అధికారులతో కలిసి కలెక్టర్, ఇతర ప్రజాప్రతినిధులు వేడుకల్లో పాల్గొన్నారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా, వికసిత్‌భారత్ ప్రత్యేకాధికారి రాహుల్‌మాలిక్, ఎమ్మెల్యే కోన రఘుపతి రమాదేవి దంపతులు, ఇతర అధికారులు సంప్రదాయ దుస్తులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండిపై అధికారులు ఊరేగింపుగా ప్రాంగణం వద్దకు వచ్చారు. పొంగళ్లు పెట్టి అందరికీ వడ్డించారు. చిన్నారులపై భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. టగ్గాఫ్‌వార్‌లో కలెక్టర్ జట్టు విజేతగా నిలిచింది. గాలిపటాలు ఎగురవేశారు. ముగ్గులు ఇతర ఆటల పోటీలు నిర్వహించారు. ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఎస్పీ వకుల్‌జిందాల్, సంయుక్త కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. రైతులు క్షేమంగా ఉంటే ప్రజలంతా సుభిక్షంగా ఉంటారని ఎమ్మెల్సీ పోతుల సునీత తెలిపారు. ఈ వేడుకల్లో ఏఎస్పీ మహేష్, డీఆర్వో వెంకటరమణ, ఏవో గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



భోగిమంటలు వేస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా,ఎమ్మెల్యే కోన రఘుపతి తదితరులు



పొంగలి పొంగిస్తున్న మహిళా అధికారులు, నాయకులు



తిరగలి విసురుతున్న ఎమ్మెల్సీ పోతుల సునీత తదితరులు



సంక్రాంతి సంబరాల్లో భాగంగా గంగిరెద్దు విన్యాసం

హరిదాసు.. ఓ జ్ఞాపకం

- కనుమరుగైపోయిన సనాతన ఆచారం
- వినపడని హరిలో రంగ హరి సంకీర్తన



గుంటూరు సిటీ, జనవరి 12: చేతిలో చిడతలు, కాళ్లకు గజ్జెలు, పట్టు పంచె ధోవతి, నెత్తిన గుండ్రటి రాగిపాత్ర నోటి నిండా నారాయణుని నామ సంకీర్తనతో పొద్దు పొడవక ముందే తరతమ భేదం లేకుండా ఇంటింటికి వచ్చే వారే హరిదాసులు. ధనుర్మాసం ఆరంభం కాగానే హరిదాసు ఇంటి ముందుకు వచ్చాడంటే సంక్రాంతి దగ్గర్లో ఉన్నట్లు లెక్క. వాళ్లకి కుల మతాలతో పనిలేదు. ధనికులు దరిద్రులన్న తేడా లేదు. హరినామ స్మరణ చేసే వారిని అనుగ్రహించడానికి హరిదాసు రూపంలో వైకుంఠం నుంచి సాక్షాత్తు శ్రీమహావిష్ణువే వస్తాడన్నది నమ్మకం. హరిదాసు వట్టిచేతులతో వెళ్లిపోతే ఆ ఇంటికి అరిష్టమని కొంతమంది నమ్మకం. అందుకే ఊరిలోకి హరిదాసుడు వస్తున్నాడంటే ఇంటి యజమానురాలు ధాన్యంతో గుమ్మంలో సిద్ధంగా ఉంటారు. ఒక ముక్క లో చెప్పాలంటే హరిదాసు మన సంస్కృతి లో భాగం. సంక్రాంతి పండుగలో భాగం. చిన్నప్పటి మన జ్ఞాపకం. ఇప్పుడా హరిదాసు కనపడటం లేదు. హరిలో రంగ హరి అంటూ వినిపించే హరినామ సంకీర్తన వినపడటం లేదు. మొత్తంగా హరిదాసు జాడేలేదు. మారిన సమాజ స్థితిగతులు శతాబ్దాల నాటి హరిదాసు వైభవాన్ని మాయం చేశాయి. తాతలు, తండ్రుల తరం వెళ్లిపోయాక వారి పిల్లలు హరిదాసు కట్టు బొట్టు పెట్టేందుకు తటపటాయిస్తున్నారు. కొన్ని చోట్ల తగినంత ఆదరణ లేకపోవడం, మరికొన్ని చోట్ల కొద్దిగా చిన్న చూపు చూస్తూ ఉండటంతో తండ్రి వారసత్వంగా హరిదాసు వృత్తిని కొనసాగించేందుకు వారి పిల్లలు ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితుల్లో హరిదాసు ఓ జ్ఞాపకంగా మారాడు. పాత సినిమాల్లో.. పుస్తకాల్లో.. కథల్లో.. ఓ స్మృతిగా కనిపిస్తున్నాడు.

ఉదయ్‌తో విశాఖకి కనెక్టివిటీ

- జెండా ఊపిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- రైళ్ల పొడిగింపులతో ప్రయాణికులకు ఎంతో మేలు
- గుంటూరు రైల్వేస్టేషన్‌లో అట్టహాసంగా ప్రారంభోత్సవం

గుంటూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉదయ్ ఏసీ డబుల్ డెక్కర్ రైలుతో గుంటూరు - విశాఖపట్టణం మధ్య రైలు కనెక్టివిటీ మరింత పెరిగిందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి తెలిపారు. వారంలో ఐదు రోజులు నడిచే ఈ రైలు సమయపట్టిక ప్రయాణికులకు ఎంతో సౌకర్యవం తంగా ఉంటుందన్నారు. వేకువజాము న విశాఖలో బయలుదేరితే మధ్యాహ్నానికి గుంటూరుకు చేరుకోవచ్చని, అలానే గుంటూ రులో సాయంత్రం రైలు ఎక్కితే రాత్రికి విశాఖ చేరవచ్చన్నారు. శుక్రవారం సాయంత్రం గుంటూ రు రైల్వేస్టేషన్‌లో ఉదయ్ ఎక్స్‌ప్రెస్ పొడిగింపు ప్రారంభోత్సవం జరిగింది. రేణిగుంటలో నంద్యాల ప్యాసింజర్, నరసపూర్‌లో అమరావతి ఎక్స్‌ప్రెస్‌లను వీడియో లింకు ద్వారా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన మంత్రి కిషన్‌రెడ్డి కార్యక్రమానికి హాజరైన రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రయాణికులను ఉద్దేశించి ప్రసంగిం చారు. ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లో ఏసీ బోగీలతో పాటు నాన్ ఏసీ కోచ్‌లు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అలానే కర్ణాటక ప్రాంతానికి కోస్తాంధ్రతో కనెక్టివి టీ పెంచేందుకు హుబ్లీ - విజయవాడ అమరావతి ఎక్స్‌ప్రెస్‌ని నరసపూర్‌కు పొడిగించామన్నారు. నంద్యాల ప్రాంత ప్రయాణికులకు తిరుపతి కనెక్టివిటీని పెంచేందుకు నంద్యాల - కడప రైలుని రేణిగుంటకు పొడిగించామని చెప్పారు. ఈ మూడు రైళ్ల పొడిగింపులతో ప్రయాణికులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ రైల్వేలో ప్రధాని మోదీ నేతృత్వంలో అనేక సంస్కరణలను ప్రవేశ పెట్టడం అభినందనీయ మన్నారు. గుంటూరులో పెండింగ్‌లో ఉన్న ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలకు ఆమోదం తెలపాలని కోరారు. అలానే రైల్వేస్టేషన్‌కు రెండు వైపులా అప్రోచ్‌రోడ్లను రైల్వే నిర్మించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఎం ఎం రామకృష్ణ, బీజేపీ మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి వల్లూరు జయప్రకాష్‌నారా యణ, జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌కి సిగ్నల్ ఇస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

వేసవిలో ప్రేక్షకుల ముందుకు



పురాణ, ఇతిహాసాలను ఆధారం చేసుకొని, దానికి సైన్స్ ఫిక్షన్‌ని జత చేసి, భవిష్యత్తును అద్భుతంగా ఊహిస్తూ... దర్శకుడు నాగ్‌అశ్విన్ తెరకెక్కిస్తున్న పాన్‌ఇండియా ఫాంటసీ మూవీ 'కల్కి 2898 ఏడీ'. ప్రభాస్ టైటిల్‌రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, కీలక పాత్రలు పోషిస్తున్నారు. దీపికా పదుకొనే, దిశా పటానీ కథానాయికలు. ప్రతిష్ఠాత్మక వైజయంతీ మూవీస్ పతాకంపై అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతోంది. ఈ సినిమాను మే 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు నిర్మాత సి.అశ్వనీదత్ ప్రకటించారు. కాశీ, ముంబై, ఢిల్లీ, చండీగఢ్, చెన్నై, మధురై, హైదరాబాద్, విశాఖపట్నం, గుంటూరు, భీమవరం, విజయవాడ, కశ్మీర్‌తో సహా దేశంలోని పలు నగరాల్లో రైడర్‌ల ద్వారా ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ డేట్‌ను మేకర్స్ విభిన్నంగా ప్రకటించారు. 'వైజయంతీ మూవీస్ 50ఏళ్ల ప్రయాణంలో మే 9వ తేదీకి ఎంతో ప్రాధాన్యం ఉంది. మా సంస్థ నుంచి వచ్చిన జగదేకవీరుడు-అతిలోకసుందరి, మహానటి, మహర్షి చిత్రాలు అదే తేదీలో విడుదలై అఖండ విజయాలను చవిచూశాయి. అమితాబ్, కమల్, ప్రభాస్, దీపిక పదుకొనే వంటి ప్రతిభావంతులైన ఆర్టిస్టులు కలిసి నటిస్తున్న ఈ చిత్రం వైజయంతీ మూవీస్ చరిత్రలోనే మైలురాయిలా నిలిచిపోతుందని నమ్మకంగా చెప్పగలం' అని నిర్మాత అశ్వినీదత్ పేర్కొన్నారు. హాలీవుడ్ టెక్నీషియన్స్ పనిచేస్తున్న ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, సంగీతం: సంతోశ్ నారాయణ్,



రిపబ్లిక్ డేకు మిల్లర్ రాక

ధనుష్ కథానాయకుడిగా రూపొందిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో జి. శరవణన్, సాయి సిద్ధార్థ్ నిర్మించారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ చిత్రం తెలుగు వెర్షన్ మినహా మిగిలిన భాషల్లో శుక్రవారం రిలీజ్ చేశారు. తెలుగులో మాత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సినిమా తెలుగు హక్కులు కొనుగోలు చేసిన ఏషియన్ మల్టీప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, సురేశ్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని ఈ నెల 25న విడుదల చేస్తున్నట్లు శుక్రవారం తెలిపాయి. ఈ చిత్రంలో ప్రియాంక మోహన్ కథానాయిక. సందీప్ కిషన్, శివ రాజ్‌కుమార్ కీలకపాత్రలు పోషించారు. జీవీ ప్రకాశ్‌కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందించారు.

చెప్పినదానికంటే గొప్పగా తీశాడు

'సైంధవ్' రెగ్యులర్ కథ కాదు. డిఫరెంట్ జానర్. కథ డిమాండ్ మేరకే ఎమోషనల్ యాక్షన్ సీక్వెన్స్ ఉంటాయి. అవి కూడా నేచురల్‌గా ఉంటాయి. నా వరకూ ఈ సినిమా విషయంలో ప్రత్యేకంగా నచ్చిన అంశం ఏంటంటే.. కూతురు సెంటిమెంట్. చాలారోజుల తర్వాత ఎమోషన్స్ పలికించే అవకాశం వచ్చింది. నటుడిగా నాకిది కొత్త జానర్' అన్నారు అగ్రనటుడు వెంకటేశ్. ఆయన హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి నిర్మించిన చిత్రం 'సైంధవ్'. నేడు(శుక్రవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా వెంకటేశ్ విలేకరులతో మాట్లాడారు.

చాలామంది హీరోలు కెరీర్ పరంగా యాభై, డెబ్బై ఐదు, వంద.. ఇలాంటి నంబర్లను మైలురాళ్లుగా భావిస్తుంటారు. దాంతో ఒత్తిడి సహజం. నాకైతే అలాంటి ఒత్తిడి ఏమీ లేదు. 75 అనేది నా వరకూ నంబర్ మాత్రమే. ప్రతి సినిమాకూ నిజాయితీగా నిబద్ధతతో పనిచేయాలనేది నా సిద్ధాంతం. 75వ సినిమాతో అయిపోలేదు.. ఇంకా చాలా ప్రయాణం మిగిలుంది.

- దర్శకుడు శైలేశ్‌తో పనిచేయడం గొప్ప అనుభవం. అద్భుతమైన కథతో నా దగ్గరకొచ్చాడు తను. చెప్పినదానికంటే గొప్పగా తీశాడు. లొకేషన్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ మాదిరిగా అందరితో కలిసిపోయి పనిచేశాడు. ముఖ్యంగా క్లైమాక్స్‌ని ఎక్స్‌ట్రార్డినరీగా డిజైన్ చేశాడు. కథ నడిచే తీరు కూడా కొత్తగా ఉంటుంది. ఇదంతా శైలేష్ గొప్పతనమే.
- ఇది చైల్డ్ సెంటిమెంట్ మూవీ. ఇందులో నా కూతురుగా బేబీ సారా నటించింది. ఆ అమ్మాయిలో గొప్ప స్పార్క్ ఉంది. అద్భుతంగా నటించింది. మా ఇద్దరిపై తీసిన సన్నివేశాలు ప్రేక్షకులను భావోద్వేగాలకు గురిచేస్తాయి. ఓ విధంగా ఈ కథ తనదే.
- దేశం గర్వించదగ్గ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ.. అతనితో కలిసి పనిచేసినందుకు చాలా ఆనందంగా ఉంది. 'గ్యాంగ్స్ ఆఫ్ వసేపూర్' నుంచి ఆయన ప్రయాణం విలక్షణంగా సాగుతోంది. ఇందులో ఆయనది చాలా క్రేజీ రోల్. సాధారణ సందర్భాల్లో కూడా విభిన్నంగా నటించే నటుడు నవాజుద్దీన్. ఇందులో ఆయన మార్క్ నటనను చూస్తారు.
- నిర్మాత ఏ విషయంలోనూ రాజీ పడలేదు. కథ డిమాండ్ మేరకు 'ఇంద్రప్రస్థ' అనే ఫిక్షన్ సిటీని నిర్మించారాయన. డ్రగ్స్, గన్స్ ఇలాంటి హాలీవుడ్ తరహా కల్చర్ తెరపై కనిపిస్తుంది. ఇదంతా దర్శకుడి సృజన. 'సైంధవ్' సినేరియా చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా తర్వాత ఇలాంటి కథలు ఇంకొన్ని వస్తాయి. ఇక నా విషయానికొస్తే కథలు వింటున్నాను. చేయబోతున్న సినిమాల గురించి త్వరలో చెబుతా.



వెంకటేశ్



డేట్ కుదిరింది



రాజ్‌తరుణ్ హీరోగా ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తిరగబడరా సామి'. మాల్వీ మల్హోత్రా కథానాయిక. మల్కాపురం శివకుమార్ నిర్మాత. శుక్రవారం ఈ చిత్రం రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. ఫిబ్రవరి 23న 'తిరగబడరా సామి' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. 'యువతను ఆకట్టుకునే రొమాన్స్, కుటుంబ ప్రేక్షకులను ఆకర్షించే సెంటిమెంట్, మాస్‌ను అలరించే హై వోల్టేజ్ యాక్షన్, ఎమోషనల్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. మనారా చోప్రా ప్రత్యేకగీతంలో నర్తించారు' అని యూనిట్ తెలిపింది. మకరంద్‌దేశ్‌పాండే, జాన్ విజయ్, రఘుబాబు, అంకిత ఠాకూర్, రాజా రవీంద్ర కీలకపాత్రలు పోషించారు. సంగీతం:జేబీ. సినిమాటోగ్రఫీ: జవహర్ రెడ్డి ఎం.ఎన్

తంత్ర గీతం వచ్చింది




అనన్య నాగళ్ల, ధనుష్ రఘుముద్రి, సలోని ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'తంత్ర'. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వంలో నరేశ్‌బాబు పి., రవిచైతన్య నిర్మించారు. ఈ చిత్రం నుంచి అనురాగ్ కులకర్ణి ఆలపించిన 'ధీరే ధీరే' అంటూ సాగే గీతాన్ని శుక్రవారం హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్, నటి అనసూయ చేతుల మీదుగా చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'అనురాగ్ కులకర్ణి అద్భుతంగా ఆలపించిన గీతమిది. త్వరలో ట్రైలర్‌ను రిలీజ్ చేస్తాం' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ఫస్ట్ లుక్, టీజర్‌కు వస్తున్న ఆదరణ మాకు చాలా ఉత్సాహాన్నిచ్చింది. వినూత్నమైన అంశాలతో ప్రేక్షకులకు వినోదం పంచే చిత్రమిది' అన్నారు.



సోదర ద్వయం దర్శకత్వంలో

వరుస వైఫల్యాలను అధిగమించి 'విక్రమ్' చిత్రంతో తిరిగి హిట్ బాట పట్టారు కమల్‌హాసన్. ఆ సక్సెస్ ఇచ్చిన ఉత్సాహంతో వరుస సినిమాలను పట్టాలెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఆయన మణిరత్నం దర్శకత్వంలో 'థగ్ లైఫ్' చిత్రం చేస్తున్నారు. షూటింగ్ జరుగుతోంది. దీంతో పాటు ఆయన కథానాయకుడిగా ఓ పాన్ ఇండియా చిత్రం రూపొందుతోంది. 'కేహెచ్ 237' అనేది వర్కింగ్ టైటిల్. ఆర్ మహేంద్రన్‌తో కలసి కమల్‌హాసన్ తన సొంత బేనర్ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌పై నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి మేకర్స్ స్పెషల్ అప్‌డేట్ ఇచ్చారు. యాక్షన్ కొరియోగ్రాఫర్‌లు అన్బు, అరివు సోదర ద్వయం 'కేహెచ్ 237'కు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ విషయాన్ని కమల్‌హాసన్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా అన్బు అరివ్‌తో దిగిన ఫొటోను కమల్‌హాసన్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని చిత్రబృందం తెలిపింది.





బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



మహిళలకు చీర, సంచి కరపత్రాన్ని అందజేస్తున్న నరేంద్రవర్మ తదితరులు

ప్రతి ఇంటికి టీడీపీని చేరువచేయటమే లక్ష్యం

● బాపట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ

పిట్టలవానిపాలెం, జనవరి 12 : ప్రతి ఇంటికి తెలుగుదేశంపార్టీని చేరువచేయటమే లక్ష్యమని బాపట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలపరిధిలోని సంగుపాలెం గ్రామంలో వేగేశన నరేంద్రవర్మ తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికెళ్ళి టీడీపీ విధివిధానాలు వివరించారు. మీమాటే-నాబాట, భవిష్యత్తుకు గ్యారెంటి గురించి తెలియజేసే కరపత్రాలను అందజేశారు. అనంతరం నరేంద్రవర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని, రాబోయే ఎన్నికలలో ఓటుతో ఓడించాలన్నారు. సంగుపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు చందోలు బాబుఆనంద్‌ను టీడీపీలోకి ఆహ్వానించి పార్టీ కండువాకప్పారు. మహిళలకు చీర,నిత్యావసర సరుకులు తెచ్చుకునే సంచి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కోడూరి గ్రామసర్పంచ్ ఐనంపూడి శ్రీనివాసరావు, మండల, గ్రామ టీడీపీ నాయకులు ఎండి అఫ్జల్, తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి జాలాది లోకరాజ్యుడు, టీడీపీ గ్రామపార్టీ అధ్యక్షులు జాలాది అశోక్, కడియాల ప్రసాద్, ఉయ్యూరి వెంకటేశ్వరరావు, బర్మా ఝాన్సీ, బర్మా దిలీప్, బర్మాపీటర్ పాల్, కె.కాలేబ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను అట్టడుగు ప్రజలకు అందించాలి

● వికసిత్‌భారత్ ప్రభారి ఆఫీసర్ రాహుల్ మాలిక్



సమావేశంలో మాట్లాడుతున్న రాహుల్ మాలిక్, చిత్రంలో కలెక్టర్, జేసీ

బాపట్ల, జనవరి 12 : కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అట్టడుగు ప్రజలకు అందించటానికి చర్యలు తీసుకోవాలని వికసిత్ భారత్ ప్రభారి ఆఫీసర్ రాహుల్ మాలిక్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుపై జిల్లా అధికారులతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల ప్రభుత్వ పథకాలు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కేంద్రప్రభుత్వం ద్వారా అందిస్తున్న సంక్షేమపథకాలను ఈనెల 26వ తేదిలోగా నూరుశాతం ప్రజలకు లబ్ది చేకూర్చాలన్నారు. అనంతరం 2024-2025 లింకేజి క్రెడిట్ ప్లాన్‌ను ఆయన ఆవిష్కరించారు. సమావేశంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, గృహనిర్మాణశాఖ పీడీ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ కృష్ణ, డ్వామా పీడీ డాక్టర్ బి.అర్జునరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా పౌర సరఫరాల అధికారులు విలియమ్స్, జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

పోలీసుసిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం : ఎస్పీ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, జనవరి 12 : జిల్లా పోలీసుల సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో నిర్మించిన గార్డ్‌రూమ్‌లను శుక్రవారం అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు క్యాంప్ కార్యాలయంలో గార్డ్ డ్యూటీ విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉంటారన్నారు. విరామ సమయంలో విశ్రాంతి తీసుకోవటానికి తగిన సదుపాయం లేకపోవటంతో వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. వారి సమస్యలను దృష్టిలో ఉంచుకొని తగిన సౌకర్యాలతో గార్డ్ రూమ్‌లను నిర్మించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, డిఎస్పీ టి.వెంకటేశులు, ఎఆర్‌డిఎస్పీ ఎండిహెచ్ ప్రేమ్‌కుమార్, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.సూర్యనారాయణ, అడ్మిన్ ఆర్ఐ ఎల్.మన్మధరావు, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్ నాయక్, హోమ్‌గార్డ్ ఆర్ఐ ఎల్.గోపినాధ్, పట్టణ సీఐ ఎస్.శ్రీనివాసులు, జిఎస్సార్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత గుండ్రెడ్డి శివ తదితరులు పాల్గొన్నారు.

దోచుకున్న ఆస్తులను చట్టబద్ధం చేసేందుకే : నామన

బాపట్ల, జనవరి 12 : ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి దోచుకున్న ఆస్తులను చట్టబద్దం చేసుకునేందుకు భూ యాజమాన్య హక్కు చట్టాన్ని తీసుకొచ్చారని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ విమర్శించారు. చట్టానికి వ్యతిరేకంగా బాపట్లలో న్యాయవాదలు చేస్తున్న నిరసన దీక్షకు మద్దతుగా శుక్రవారం జనసేన నాయకులతో కలిసి ఆయన సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆస్తులకు సంబంధించిన పట్టాదారుపాస్‌పుస్తకాలలో, సర్వేరాళ్ళపై జగన్‌రెడ్డిబొమ్మలు ఎందుకని ప్రశ్నించారు? రాష్ట్రంలో ప్రజల ఆస్తులన్ని పాలకుల గుప్పెట్లో ఉంచుకునేందుకు ఈ కొత్త చట్టమన్నారు. నిస్వార్ధంగా సమాజం కోసం న్యాయవాదులు చేస్తున్న పోరాటానికి జనసేన పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఆరమళ్ళ సుజిత్, గోగన ఆదిశేషు, ఇమ్మడిశెట్టి మురళీ కృష్ణ, కాటూరి రత్నకుమారి, నామన శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేనపార్టీ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ

వైసీపీ పాలనలో బీసీ సామాజిక వర్గానికి తీరని అన్యాయం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జయప్రకాష్ నారాయణ

బాపట్ల, జనవరి 12 : వైసీపీ పాలనలో రాష్ట్రంలోని బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీశ్రేణులతో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ సంజీవ్‌లాగానే మరికొద్ది రోజులలో చాలా మంది బీసీ నేతలు వైసీపీని వీడనున్నట్లు తెలిపారు. జగన్‌రెడ్డిపాలనలో బీసీలకు చేసేందేమిలేదన్నారు. సరైన విద్యాప్రోత్సాహకాలు అందటంలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆరాచకం కొనసాగుతుందని విమర్శించారు. అభివృద్ది కంటే అప్పులు వైపు అడుగులు వేస్తుందన్నారు. పార్టీలో బీసీలకు సరైన గౌరవంలేదన్నారు. సమావేశంలో టీడీపీ బీసీ నాయకులు తోట నారాయణ, గొలపల శ్రీనివాసరావు, పరిశా రమేష్‌గౌడ్, వడ్లమూడి వెంకటేశ్వరరావు, ఉప్పాల కృష్ణగౌడ్, గుడిపల్లి సాంబశివరావు, కొల్లూరి వెంకట్రావు, మురళీ, క్రి మునేశ్వరరావు, వక్కముంతుల హనుమాన్‌జి, కర్పూరపు మురళీ, మరీద్ వెంకటేశ్వర్లు, సూరగాని శేఖర్ పాల్గొన్నారు.



బీసీ నాయకులతో కలిసి సమావేశంలో మాట్లాడుతున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ

ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన ఎన్టీఆర్

● ఎమ్మెల్సీ టీడీ జనార్దన్

బాపట్లరూరల్, జనవరి 12 : రాష్ట్ర ప్రజల మనస్సులో చిరస్థాయిగా నిలిచిన మహోన్నత వ్యక్తి స్వర్గీయ నందమూరి తారకరామారావు అని ఎన్టీఆర్ లిటరేచర్, వెబ్ సైట్, సావనీర్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ అన్నారు. శుక్రవారం కమ్మజనసేవాసమితి కళ్యాణ మండపంలో ఎన్టీఆర్ శతజయంతి వేడుకలు సందర్భంగా ఎన్టీఆర్ లిటరేచర్, వెబ్ సైట్‌కమిటీ వెలువరించిన మూడు గ్రంథాల ఆవిష్కరణకు సమావేశాన్ని ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. నేటి తరం మహనీయుడు దివంగత తారకరామారావు గురించి అవగాహన కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉందని, అందుకోసమే 15 మంది కలిసి ఎన్టీఆర్ గురించి మూడు గ్రంథాలను పుస్తకరూపంలో అందించేందుకు కృషి చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలలో ఆంధ్రరాష్ట్రంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువాళ్ళు ఒక పండుగ వాతావరణంగా జరుపుకున్నారని అన్నారు. అనంతరం ఎన్టీఆర్ గ్రంథాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ, చీరాల టీడీపీ ఇన్‌చార్జి ఎం.ఎం.కొండయ్య, మన్నె శ్రీనివాసరావు, సుందరరావు, భగీరధ, అట్లూరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్‌కు సంబంధించిన మూడు గ్రంధాల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, ఆనందబాబు, వేగేశన తదితరులు

వైభవంగా కమలాత్మికహోమం, శ్రీలక్ష్మీపుష్పార్చన

బాపట్ల, జనవరి 12 : శ్రీ లలిత త్రిపురసుందరి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల విశేష పూజా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కమలాత్మికహోమం, శ్రీలక్ష్మీపుష్పార్చన విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చీలురోడ్డులోని శ్రీ పాండురంగస్వామి దేవాలయ ప్రాంగణంలో పీఠం నిర్వాహకులు నెమలి కంటి హనుమంతరావు సారధ్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోన రఘుపతి, ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ పాల్గొని పూజలు నిర్వహించారు. అర్చకులు మేడూరి వెంకటఅప్పలాచార్యులు,కేశావాచార్యులు, పరాశరం రఘురాం, పంగులూరి కౌండిన్య, గూడూరు సాయివెంకట్, యాజ్ఞీకం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మార్పూరి బదిరి నారాయణ, భక్తసమాజం నిర్వాహకులు నీరజదేవి, బండి వెంకటరాంబాబు, కొత్రా శ్రీనివాసరావు, ఉప్పాల హరికృష్ణ, శివన్నారాయణ పాల్గొన్నారు.

దత్తాత్రేయస్వామి సన్నిధిలో దత్తగానలహరి సీడీ ఆవిష్కరణ

బాపట్ల జనవరి 12 : పట్టణంలోని శ్రీ శంకర విద్యాలయం వేదికగా రావినూతల శ్రీరామమూర్తి రచించిన దత్తగానలహరి పుస్తకం, సీడీలను శుక్రవారం ఆవిష్కరించారు. దత్తత్రేయస్వామి సన్నిధిలో కుటుంబ సభ్యులు, పండితులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాటకరంగంలో, సాహిత్యరంగంలో రావినూతల ఎంతో కృషి చేసి విశేష గుర్తింపు పొందారని, దత్త గానలహరి ద్వారా భక్తిపాటలను ప్రచారం చేయటం పూర్వజన్మసుకృతమని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ సంగీత విద్యాంసురాలు జె.నాగపూర్ణ రమాదేవి, ప్రకాష్, అన్నపూర్ణ, శేషసాయి ఆనంద్, కె.చంద్రశేఖర్, చలపతిరావు, భుజిగేంద్రమౌళి, వెంకు, ఆలయకమిటీ సభ్యులుపాల్గొన్నారు.

ప్రజాపరిచయ వేదిక ద్వారా ప్రజల్లోకి

● రాధేయ్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత దగ్గుమళ్ళ రాధేయ్

బాపట్ల, జనవరి 12: ప్రజాపరిచయ వేదిక ద్వారా ప్రజల్లోకి విశ్రాంత ఐఆర్ఎస్ దగ్గుమళ్ళ ప్రసాదరావు వస్తున్నట్లు ఆయన తనయుడు, రాధేయ్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత దగ్గుమళ్ళ రాధేయ్ తెలిపారు. పట్టణంలోని విలియంబూత్ జూనియర్ కళాశాల సమీపంలోని క్రిస్టియన్ భవనం ప్రాంగణంలో శనివారం ప్రజాపరిచయవేదిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లను టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవతోటి సుందరయ్య తదితర నాయకులతో కలిసి రాధేయ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఐఆర్ఎస్‌గా సేవలందించి స్వచ్ఛందంగా ఉద్యోగం వదులుకుని ప్రజా సేవ చేయాలనే సంకల్పంతో ప్రసాదరావు రాజకీయ అరంగ్రేటం చేసినట్లు తెలిపారు. తమ పూర్వీకులు బాపట్లలోని డీఎమ్ పల్లికి చెందిన వారని తాతయ్య దగ్గుమల్లి లూకా, సుశీలమ్మలు ఉపాధ్యాయులుగా పర్చూరు నియోజకవర్గంలోని చింతగుంపలలో స్థిరపడ్డారన్నారు. చీరాల వీఆర్ఎస్అండ్ వైఆర్ఎన్ కళాశాలలో డిగ్రీ వరకు చదువుకుని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేసి ఐఆర్ఎస్ సాధించిన ప్రసాదరావు ప్రజా సేవ కోసం టీడీపీ బాపట్ల లోక్‌సభపై ఆసక్తి చూపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత సీఈవో జంగం రాజశేఖర్, టీడీపీ బాపట్ల పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు జంగం ప్రవీణ్, నాయకులు పాటిబండ్ల శేఖర్‌బాబు, టీడీపీ బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజని, మహిళా కార్యదర్శి కూచిపూడి ఝాన్సీరాణి, షేక్.నజ్మా, పల్లంజీవన్ తదితరులు పాల్గొన్నారు.



వేదిక ఏర్పాట్లను పరిశీలిస్తున్న దగ్గుమళ్ళ రాధేయ్ తదితరులు

ఇంటూరులో వికసిత భారత్ కార్యక్రమం

అమృతలూరు, జనవరి 12 : వికసిత్ భారత్‌లో భాగంగా అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఇంటూరు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర నోడల్ ఆఫీసర్ రాహుల్ మాలిక్ ముఖ్య అతిధిగా హాజరై కేంద్ర ప్రభుత్వం ప్రజల అభివృద్ధి కోసం అమ లు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా రైతులకు అందజేస్తున్న పురుగు మందుల పిచికారీ డ్రోన్‌ను ప్రయోగాత్మకంగా ప్రదర్శించారు. మహిళలకు ఉజ్వల పథకంలో గ్యాస్ సిలిండర్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, రేపల్లె ఆర్డీవో హెలా షారోన్, జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్, తహసీల్దార్ మెహర్‌కుమార్, ఎంపీడీవో షేక్ మాబు సుభాని, ఏవో లోకేశ్వరి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి, బీజేపీ మండల అధ్యక్షుడు కొల్లూరు అమర్‌నాథ్ పాల్గొన్నారు.



పురుగు మందుల పిచికారీ డ్రోన్‌ను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

ప్రణాళికా బద్ధంగా గ్రామాల అభివృద్ధి : ఈవోపీఆర్డీ

వేమూరు, జనవరి 12 : ప్రణాళికా బద్దంగా గ్రామాల అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఈవోపీఆర్డీ శేఖర్ తెలిపారు. పంచాయితీ కార్యదర్శులతో గ్రామాల అభివృద్ధి ప్రణాళిక అంశంపై శుక్రవారం రెండో రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక రూపొందించుకోవాలన్నా రు. ప్రణాళికాబద్దంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. పలు అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జడ్సన్‌పాల్, పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పిట్టలవానిపాలెం, జనవరి 12 : ఖాజీపాలెం గ్రామశివారు పంట పొలాలలో శుక్రవారం పేకాట స్థావరంపై ట్రైనింగ్ డీఎస్పీ విజయశ్రీ, చందోలు ఎస్సై ఎస్.రాజశేఖర్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్టు చేసి రూ.13,860 నగదు స్వాధీనం చేసుకున్నారు.

స్వామివివేకానందకు ఘన నివాళి

భట్టిప్రోలు, జనవరి 12 : వివేకానంద విగ్రహ సాధన కమిటీ ఆధ్వర్యంలో భట్టిప్రోలు బౌద్ధస్థూపం వద్ద గల మినీ ట్యాంక్‌బండ్‌లో శుక్రవారం వివేకానంద జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. తెనాలికి చెందిన ప్రముఖ న్యాయవాది జొన్నాదుల వెంకటేశ్వరరావు, ముద్దా లీలామోహనరావుతో పాటుగా పలువురు ప్రముఖులను సాధన కమిటీ సభ్యులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాధన కమిటీ సభ్యులు రావూరి శ్రీనివాసమూర్తి, బండారు శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు, రామనాదం రామకృష్ణ, బూర్లె రాంప్రసాద్, సి. రామకోటేశ్వరరావు, క్రాప రవికుమార్, వంగరచలమయ్య సిద్ధాంతి పాల్గొన్నారు. ఐలవరంలో వివేకానంద గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివేకానంద 2024 పురస్కారాన్ని నగరం గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, ఆధ్యాత్మికవేత్త యల్లాప్రగడ సీతాపతికి అందించి మెమెంటో, శాలువాలు పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు జంజనం హేమశంకరరావు, జ్యోతిలక్ష్మి, పి.వెంకటేశ్వరరావు, అందె వెంకటేశ్వర్లు, బూర్లె అరుణకుమారి, దీవి రఘునాధ చక్రవర్తి పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై కఠిన చర్యలు

భట్టిప్రోలు, జనవరి 12 : విద్యుత్ చౌర్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ గుంటూరు విజిలెన్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పివి మల్లికార్జునరావు తెలిపారు. విద్యుత్ శాఖ విజిలెన్స్ బృందాలు శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాల్లో 5588 సర్వీసులను తనిఖీ చేయగా 148 సర్వీసులు విద్యుత్‌లోడ్ అధికంగా వినియోగిస్తున్నట్లు గుర్తించి రూ.6.20 లక్షలు అపరాధ రుసుంను వసూలు చేసినట్లు ఆయన చెప్పారు. ఈ తనిఖీలలో రేపల్లె డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నెమలికంటి భాస్కరరావు, భట్టిప్రోలు ఎఈ ఏడుకొండలు, తెనాలి డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఓటర్ల చేర్పుల అక్రమాలు విచారించాలి

అమృతలూరు, జనవరి 12 : మండలంలో నూతన ఓటర్ల చేర్పుల అవకతవకలపై విచారణ చేపట్టాలని టీడీపీ నాయకులు కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. మండలంలోని పలు గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఓటర్లను చేర్పించారని, ఎన్నికల నిబంధనల ప్రకారం స్థానికేతరులను ఓటర్లుగా సమోదు చేయకూడదన్నారు. నివాసం లేకుండా తాత్కాలికంగా నివాసం చేసుకుంటున్న వారిని ఆధారాలు లేకపోయినా విచారణ చేయకుండా రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గి జాబితాలో చేర్చారని చెప్పారు. వెంటనే దొంగ ఓట్లను తొలగించాలని లేని పక్షంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకు వెళతామని చెప్పారు. పార్టీ నాయకులు యలవర్తి బ్రహ్మానందం కొత్తపల్లి రవీంద్రబాబు, శరణుగిరి, శివన్నారాయణ, ఐమళ్ల ప్రమోద్, కొమ్మలపాటి అజయ్, కొసరాజు దేవకుమార్, మ్యాధ్యూస్, నార్ల శ్రీను, అంకమ్మరావు పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా కూడారై ఉత్సవం

వేమూరు, జనవరి 12 : మండలంలోని జంపనిలో ఉన్న శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో శుక్రవారం తెల్లవారు ఝామున ధనుర్మాస వ్రతంలో భాగంగా కుడారై ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు మేడూరి శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో గోదా అమ్మవారికి విశేష అర్చన పూజ జరిపి తిరుప్పావై పారాయణ అనంతరం ధనుర్మాసంలో 27వ రోజు ప్రాధాన్యతను భక్తులకు వివరించారు. కమ్మ శ్రీనివాసరావు దంపతులు వార్షిక ఉత్సవ కర్తలుగా వ్యవహరించారు. శ్రీభూ సహిత చెన్నకేశవ స్వామి వారి ఉత్సవ మూర్తు లు గోదాకృష్ణుల విగ్రహాలను పల్లకీలపై ప్రతిష్ఠించి ఆలయ ప్రదక్షిణలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె, జనవరి 12 : రేపల్లె, నగరం మండలాలలో శనివారం 132/33కేవీ రేపల్లె సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నగరం మండలం 33/11కేవీ నగరం, 33/11 కేవీ ఉల్లిపాలెంలోని సంబంధిత అన్ని పంచాయతీలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎండీ నాగుల్ మీరా అన్నారు.

● భట్టిప్రోలు, జనవరి 12 : మండలంలోని భట్టిప్రోలు, పెదపులివర్రు సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతులు నిర్వహిస్తున్నందున శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఏడుకొండలు తెలిపారు. రెండు సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. సదరు విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఏడుకొండలు కోరారు.

రజక సాధికారిక కమిటీ కన్వీనర్‌గా నాగేంద్రబాబు



నాగేంద్రబాబు

రేపల్లె, జనవరి 12 : పట్టణానికి చెందిన న్యాయవాది, టీడీపీ నాయకుడు నేత్ర నాగేంద్రబాబును పార్టీ రజక సాధికారక కమిటీ జిల్లా కన్వీనర్‌గా నియమిస్తూ కమిటీ కన్వీనర్ గుర్రపుసాల రామకృ ష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, ఏలూరు సాంబశివరావుకు నాగేంద్రబాబు కృ తజ్ఞతలు తెలిపారు. రజకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానిని అన్నారు.

పెన్షన్‌దారులకు దుప్పట్ల పంపిణీ

కర్లపాలెం, జనవరి 12 : కర్లపాలెం మండలం కొత్తనందాయపాలెం గ్రామంలో కోన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెన్షన్‌దారులకు బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి అందజేసిన దుప్పట్లను సినీ రచయిత కోన వెంకట్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ సీతారామిరెడ్డి, మండలపార్టీ కన్వీనర్ ఏడుకొండలు, గ్రామ సర్పంచ్ అయ్యప్పరెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి రంగవల్లులలో రెండు బహుమతులు

కర్లపాలెం, జనవరి 12 : సంక్రాంతి సంబరాలలో భాగంగా శుక్రవారం జిల్లాకలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన రంగవల్లుల కార్యక్రమంలో కర్లపాలెం మండల సమాఖ్య నుంచి డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారి సిహెచ్ కృష్ణ ప్రోత్సహంతో 6 మంది మహిళలు పోటీలలో పాల్గొన్నారు. సమ్మెటవారిపాలేనికి చెందిన బిడ్డ ఏడుకొండలమ్మకు మొదటి బహుమతి, దుండవారిపాలెం వీవోఏ మంజుల కన్సోలేషన్ బహుమతి పొందటం జరిగిందన్నారు. జిల్లాస్థాయిలో రంగవల్లిలో కర్లపాలెం మండలానికి రెండు బహుమతులు రావటం సంతోషకరమని మండల సమాఖ్యప్రతినిధులు, సిబ్బంది తెలియజేశారు.

పెన్షన్‌దారులకు ఉచిత వైద్య శిబిరం

పిట్టలవానిపాలెం, జనవరి 12 : మండలపరిధిలోని పోతనకట్టవారిపాలెం సచివాలయంలో శుక్రవారం పెన్షన్‌దారులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పోతనకట్టవారిపాలెం సర్పంచ్ యెనుముల పార్వతి, ఎంపీడీవో భవనం మారుతి శేషమాంబ, ఈవోపీఆర్డీ కె.పద్మజలతో కలిసి పరిశీలించారు. చందోలు వైద్యాధికారి కె.లోకేష్, హెల్త్‌సూపర్‌వైజర్ యు.నరసింహారావులతో పెన్షన్‌దారులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపికృష్ణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించే వరకు పోరుబాట

● చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలాజీ



బూరగలమ్మ గుడిలో పూజలు చేస్తున్న అంగన్‌వాడీలు

రేపల్లె, జనవరి 12 : రాష్ట్రప్రభుత్వం జారీచేసిన ఎస్మా చట్టాన్ని జీవో నెం.2ను రద్దుచేసి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించే వరకు పోరుబాట కొనసాగించి తీరుతామని చే తి వృత్తి దా రు ల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు గొట్టుముక్కల బాలాజీ అన్నారు. స్థానిక బూరుగలమ్మ గుడిలో సమస్యలు పరిష్కారం కావాలంటూ శుక్రవారం పూజలు నిర్వహించారు. అంగన్‌వాడీలు, ఏఐటియూసీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె 32వరోజుకు చేరుకుంది. అంగన్‌వాడీలు చేతికి సంకెళ్ళు కట్టుకుని నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్చలు జరపకుండా బెదిరించే విధంగా ఎస్మా చట్టాన్ని ప్రయోగించటం సిగ్గుచేటన్నారు. నేటి నుంచి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ముబీనా, మొజశ్రీ, నాంచారమ్మ, నసీమున్నీసా, ధనలక్ష్మీ,అరుణకుమారి, వై.కనకదుర్గ, దుర్గాభవాని, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

● అంగన్‌వాడీలపై ఎస్మాను ప్రయోగించటం సిగ్గు చేటని అంగన్‌వాడీల వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ అన్నారు. అంగన్‌వాడీలు, సీఐటియూ నాయకులు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరింది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద వివిధ రకాల ముగ్గులు వేసి నిరసన తెలిపారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం కక్షధోరణిగా వ్యవహరిస్తుందన్నారు. సిఐటియూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ తమకు ఓట్లు వేస్తేనే వేతనాలు పెంచుతామని ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి బెదిరిస్తున్నట్లు ఉందన్నారు. ఈకార్యక్రమంలో కేవీ లక్ష్మణ్‌రావు, బేబి రాణి, రజని, నాగమణి పాల్గొన్నారు.

● కొల్లూరు, జనవరి 12 : జగనన్న మా బాధలు ఆలకించన్న అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె కొనసాగించారు. శుక్రవారం కొల్లూరులో అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె 32వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా కార్యకర్తలు జగనన్న మా బాధ ఆలకించు.. మా న్యాయమైన డిమాండ్లు తీర్చు అని దండాలు పెట్టి వేడుకుంటూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి.సుబ్బారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

● వేమూరు, జనవరి 12 : అంగన్‌వాడీలు ప్రారంభించిన నిరవధిక సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కారం చేయాలని జగనన్నకు చెబుదామంటూ వేమూరులో కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. న్యాయవాది వేమూరి రాజశేఖర్ తొలి సంతకం చేయగా ఉపాధ్యాయ సంఘాలు, ముఠా కార్మిక సంఘం, వీవోఏల సంఘం, ఆశా వర్కర్స్, యూనియన్ సభ్యులు, గ్రామస్తులు సంతకాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు అగస్టీన్, సంఘ ప్రతినిధులు అమల, అన్నపూర్ణ, రాజకుమారి, సువర్ణ, భార్గవి పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం : కొక్కిలిగడ్డ

రేపల్లె, జనవరి 12 : వైసీపీ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు అన్నారు. ఇసుకపల్లిలోని వేపాళమ్మ చెరువు రామమందిరం సమీపంలో జయహో బీసీ సదస్సును నిర్వహించారు. బీసీల వెన్ను విరిస్తున్న పోస్టర్‌ను పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 75,760కోట్లు బీసీ సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్ళించిన ఘనత జగన్‌దేనన్నారు. ఆదరణ లాంటి 30పైగా బీసీ సంక్షేమ పథకాలను రద్దు చేశారని, 70వేలకు పైగా బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చెయ్యలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బీసీలపై రోజురోజుకు దాడులు పెరిగిపోయాయని అన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి బీసీలు బుద్ధిచెప్పటం ఖాయమన్నారు. ఈకార్యక్రమంలో జీవీ నాగేశ్వరరావు, తాడిపర్తి మల్లికార్జున్‌రావు, పీవీ చింతారావు, తంగిళ్ళమూడి సాయిబాబు, పందరబోయిన గోపి, పిన్నిబోయిన లక్ష్మీ, డొక్కు అయ్యా తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న టీడీపీ బీసీసెల్ రాష్ట్ర నాయకులు కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు

ఉత్తమమైన విద్యను అందిస్తున్న ఎస్వీఆర్ఎం కళాశాల

● ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు

నగరం, జనవరి 12 : మండలంలోని ఎస్వీఆర్ఎం కళాశాల ఎంతో ఉత్తమమైన విద్య అందిస్తుందని ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాల మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్ఆర్‌కె ప్రసాద్ విగ్రహ ఆవిష్కరణ శుక్రవారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎస్ఆర్‌కె సతీమణి నలిని ప్రసాద్ విగ్రహావిష్కరణ చేశారు. ఎంపీ నాగేశ్వరరావు మాట్లాడుతూ సేవా దృక్పదంతో ఏర్పాటు చేసిన చరిత్రగల ఈకళాశాల రానున్న కాలంలో మరింత ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ కళాశాల స్థాపన నుండి రాజేశ్వరి రామకృష్ణన్ నేతృత్వంలోని బృందం చేసిన కృషి ఫలితంగా కళాశాల ఉన్నతంగా నిలిచిందన్నారు. అనంతరం కళాశాల పాలకవర్గ జీవితకాల ఉపాధ్యక్షులు నామా నందిత ప్రసాద్ నేతృత్వంలో కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా రావడం ఎన్ఏఏసిలో ఉత్తమ గ్రేడు కళాశాల సాధించడంతో పాటుగా అధ్యాపకులకు పరిశోధన వైపు దృష్టి సారించేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏవో సుధాకర్‌రావు, పీజీ డైరెక్టర్ సురేంద్రబాబు, విశ్రాంత ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు, యాజమాన్య కమిటి సభ్యులు, ఎస్ఆర్‌కె ప్రసాద్ కుటుంబ సభ్యులు, ఇతర ప్రముఖులు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్ధులు పాల్గొన్నారు.



డాక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్ విగ్రహావిష్కరణ చేస్తున్న ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు

టీఎంరావ్ హైస్కూలులో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

భట్టిప్రోలు, జనవరి 12 : స్థానిక టీఎంరావ్ హైస్కూలులో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 1987-88 సంవత్సరం పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాలలో కలుసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు. పూర్వ గురువులు లీలా మోహనరావు, నాంచారయ్య, లాల్‌జాన్ భాషా, ఎల్ఆర్‌కె, బిహెచ్ఎస్‌కె చక్రవర్తిలతో పాటుగా పలువురు గురువులకు నూతన వస్త్రాలను బహుకరించి శాలువాలు, పూలమాలతో సత్కరించి పాదాభివందనం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సి. రామకోటేశ్వరరావు, పూర్వ విద్యార్థులు ఆత్మూరి సుబ్బారావు, విజయసారధి, రమణ, పంచమర్తి శ్రీనివాసరావు, ఉష, శైలజ తదితరులు పాల్గొన్నారు.



టీఎంరావ్ హైస్కూలులో పూర్వ ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

సీఎం కార్యదర్శిని కలిసిన ఆమంచి

చీరాల, జనవరి 12: వైసీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ శుక్రవారం సీఎం కార్యదర్శి ధనుంజయ్‌రెడ్డిని కలిశారు. వారిద్దరి మధ్య కొంతసేపు ఏకాంత చర్చలు జరిగినట్లు సమాచారం. నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులపై వారి మధ్య సంభాషణ జరిగినట్లు తెలిసింది. అనుచరుల్లో కొందరు ముఖ్యులు మాత్రం ఆమంచి వైసీపీ తరఫున పర్చూరు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారని, అందులో ఎలాంటి సందేహం లేదని, తమకు తెలిసినంత వరకు అధిష్ఠానం నిర్ణయం కూడా అదేనని స్పష్టం చేస్తున్నారు. అయితే, ఆమంచి సీఎం కార్యదర్శి ధనుంజయరెడ్డిల కలయికపై పర్చూరు నియోజకవర్గంలోని ఆమంచి వ్యతిరేక వర్గంలో భిన్నాభిప్రాయాలు వక్తమవుతున్నాయి. అనుకూలవర్గం ఆమంచే అభ్యర్థిని బలంగా నమ్ముతున్నారు.

నేటి నుంచి వీరన్నపాలెంలో నాటిక పోటీలు

వీరన్నపాలెం(పర్చూరు), జనవరి 12: మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో 8వ జాతీయస్థాయి నాటిక పోటీలు శనివారం ప్రారంభమవుతున్నాయని కళానికేతన్ కళాపరిషత్ నిర్వాహకుడు కొల్లా శ్రీనివాసరావు ఒకప్రకటనలో తెలిపారు. ఈనెల 16 వరకు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రేపు గొనసపూడిలో ముగ్గుల పోటీలు

చినగంజాం, జనవరి 12: మండలంలోని గొనసపూడిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఈనెల 14వ తేది ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు ఎమ్మెల్యే సాంబశివరావు చేతులమీదుగా నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తివివరాలకు 9849083710, 9704323508 నెంబర్లను సంప్రదించాలని వీరయ్య కోరారు.

అబద్ధపు హామీలతో నయవంచన

- మాట తప్పటం, మడమ తిప్పటం జగన్మోహన్‌రెడ్డి నైజం
- వచ్చేది టీడీపీ ప్రభుత్వమే!
- ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలి
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్


ముక్తేశ్వరం గ్రామ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

బల్లికురవ, జనవరి 12: ఒక్క చాన్స్ పేరిట అబద్ధ హామీలతో వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు మోసం చేసిందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. శుక్రవారం మార్టూరు మండలం జొన్నతాళి వద్ద గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బల్లికురవ మండలం ముక్తేశ్వరం, సూరేపల్లి, రామాంజనేయపురం గ్రామాలకు చెందిన టీడీపీ నేతలతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ టీడీపీ కార్యకర్తలు సమైక్యంగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నిరుపేదలను ఆర్థికంగా ఎదిగేలా ప్రణాళికతో రూపొందించిన సూపర్ సిక్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఓటర్ పేజీ నేస్తం కార్యక్రమంలో భాగంగా 60 మందిని ఒక వార్డుగా చేసి వారి వివరాలను సేకరిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటర్ల జాబితాలను తనిఖీ చేస్తూ బోగస్‌వి ఉంటే వెంటనే అధికారులకు తెలియపరచాలన్నారు.

అనంతరం అయన గ్రామాలలో గతంలో టీడీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాల గురించి, ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం పట్టించుకోని ప్రజా సమస్యల గురించి నేతలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నైజం మాట తప్పటం, మడమ తిప్పటం మాత్రమేనని ధ్వజమెత్తారు. ఎన్నికలకు ముందు ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేస్తామని చెప్పారన్నారు. అలాగే, అంగన్ వాడీ కార్యకర్తలకు జీతాలు పెంపుదల చేస్తామని చెప్పి మాట తప్పారన్నారు. మద్యపాన నిషేధం చేస్తానని చెప్పి మహిళలను మోసం చేశారన్నారు. కోట్లు వెచ్చించి ఏర్పాటుచేసిన రైతు భరోసా కేంద్రాలు పూర్తిగా విఫలం అయ్యాయన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు ప్రతి సోమవారం పోలవరంగా మార్చి 72 శాతం పనులు పూర్తి చేయిస్తే, జగన్ రెడ్డి అధికారంలోకి రాగానే రీవర్స్ టెండర్లతో డ్రామాలు ఆడి కమీషన్ల కక్కుర్తితో జాతీయ ప్రాజెక్టును సర్వనాశనం చేసి రైతులకు తీవ్ర ద్రోహం చేశారని అన్నారు. వచ్చే ఎన్నికలలో ఓటమి చెందుతామని భయపడి ఎమ్మెల్యేలను ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారని చెప్పారు. ఎన్నిరకాలుగా అభ్యర్థులను మార్చినా ప్రజలు జగన్‌రెడ్డిని ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొండేటి ఇజ్రాయల్, నేతలు అట్లూరి నాగేశ్వరరావు, వెంకటరెడ్డి, సింగరకొండ, బైలడుగు శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు పలుగ్రామాల నేతలతో సమీక్ష

అద్దంకి, జనవరి 12: నియోజకవర్గంలోని పలు గ్రామాల నేతలతో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ శనివారం సమీక్ష నిర్వహించనున్నారు. మార్టూరు సమీపంలోని జొన్నతాళి వద్ద క్యాంప్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి జరిగే సమీక్షలకు బల్లికురవ మండలం కొండాయపాలెం, అద్దంకి మండలం తిమ్మాయపాలెం, కొరిశపాడు మండలం అనమనమూరు గ్రామాల టీడీపీ నేతలు, కార్యకర్తలు, బూత్ ఇన్‌చార్జ్‌లు, బూత్ ఏజెంట్లు, పేజి నేస్తం సభ్యులు హాజరుకానున్నారు.

నోటీసులకు బెదరం.. సమ్మెను కొనసాగిస్తాం

- ప్రభుత్వ తీరుపై అంగన్‌వాడీల ధ్వజం

ఇంకొల్లు, జనవరి 12: తమ సమస్యలు పరిష్కరించకుండా ఎన్ని నోటీసులు ఇచ్చినా బెదిరేది లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. ఇంకొల్లులో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 32వ రోజు కు చేరుకుంది. ప్రభుత్వం వెంటనే తమ న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగండ్ల వెంకట్రావు, శ్రీదేవి, నాగలక్ష్మి, రాజ్యలక్ష్మి, రమాదేవి, వెంకటరమణ, సుజాత, దేవమ్మ, రేవతి, సుబ్బాయమ్మ, సులోచన పాల్గొన్నారు.

యూటీఎఫ్ నేతల సంఘీభావం

అద్దంకిటౌన్, జనవరి 12: ఎన్నికలకు ముందు సీఎం జగన్మోహన్ రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జె.బాబురావు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారానికి 32వ రోజుకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న ధర్నా కార్యక్రమానికి యూటీఎఫ్ అద్దంకి మండల నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో గంగాధర్, పూర్ణచంద్రరావు, తంగిరాల వెంకటేశ్వర్లు, జి.శారద, తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ: తమ న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారానికి 32వ రోజుకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం ఎదుట 64 అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాటలు పాడుతూ నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం దిగి వచ్చేవరకు సమ్మెను విరమించేది లేదని చెప్పారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, అంజలి, రజని, గంగ, సునీ, తదితరులు పాల్గొన్నారు.

ఎస్మాను ప్రయోగించడం దుర్మార్గం

చినగంజాం, జనవరి 12: డిమాండ్ల సాధనకు 32 రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మె చేస్తోంటే, ప్రభుత్వం వారిపై ఎస్మా ప్రయోగించి నోటీసులు జారీ చేయడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.ప్రతాప్‌కుమార్ ధ్వజమెత్తారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరింది. కార్యక్రమంలో మండల పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

చీరాలటౌన్: ప్రభువా జగనన్న మనసు మార్చు.. మా సమస్యలు గుర్తించేలా మంచి మనసు ప్రసాదించంటూ అంగన్‌వాడీలు శుక్రవారం ప్రార్థనలు చేశారు. గతకొంత కాలంగా అంగన్‌వాడీలు నిరవధిక సమ్మె చేస్తున్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలి

చీరాల, జనవరి 12: స్వామి వివేకానంద మాటలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని స్థానిక ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వివేకానంద సేవా సమితి ప్రతినిధి సర్విశెట్టి సుబ్బరామయ్య, డాక్టర్ పీవీ ప్రసాద్, ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ రమేష్, టి.చంద్రశేఖర్, ఎం.సుబ్బారావు, పి.రామారావు, జి.హరిప్రసాద్, డీవీ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చినగంజాం: మండలంలోని కడవకుదురు గ్రామంలో జనసేన పార్టీ కార్యాలయంలో స్వామి వివేకానంద 162వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా పార్టీ కార్యాలయంలో వివేకానంద చిత్రపటానికి జనసేన పార్టీ మండల అధ్యక్షుడు సందు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు, జనసైనికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వివేకానందుని ఆశయాలను నాయకులు, జనసైనికులు ఆదర్శంగా తీసుకొని గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతనానికి కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో జనసేన మండల ప్రధాన కార్యదర్శి అడుసుమల్లి హరిబాబు, తోట అశోకచక్రవర్తి, గొల్లపూడి లక్ష్మీనారాయణ, పూల నాగులు, నాగిరెడ్డి వీరాంజనేయులు, మన్నం రాంబాబురెడ్డి, కేసిన బాజీస్వామి, ఆరిగ తిరుపతిరావు, సందు వినయ్, బొల్లేపల్లి తిరుపతిరావు, కమ్మెల వరుణ్, తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్: రోటరీ క్లబ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం రోటరీ కార్యాలయంలో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్య, కార్యదర్శులు చిన్ని మురళీకృష్ణ, చప్పిడి వీరయ్య, కోశాధికారి భువనేశ్వరి, సందిరెడ్డి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మార్టూరు: స్వామి వివేకానంద 161వ జయంతి సందర్భంగా శుక్రవారం మార్టూరులో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, జాష్టి సాంబశివరావు, సయ్యద్ కరిముల్లా, తొట్టెంపూడి భుజంగరావు, తాళ్లూరి సాంబశివరావు, ముప్పా సాంబయ్య, సెల్ సుభాని, షేక్ అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ చేయూతను సద్వినియోగం చేసుకోవాలి


రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలరాం

వేటపాలెం(చీరాల), జనవరి 12: ప్రభుత్వ చేయూతను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. వేటపాలెం మండలం అక్కాయిపాలెం పంచాయతీలో రూ.50 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే బలరాం శుక్రవారం ప్రారంభించారు. అనంతరం గత నాలుగున్నరేళ్లలో రూ.5.42 కోట్లు వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలాకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజీ, పీఆర్ డీఈఈ శేషయ్య, ఏవో కాశీవిశ్వనాధ్ పాల్గొన్నారు.

పార్కు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

చీరాల, జనవరి 12: స్థానిక కుందేరు సమీపంలో నిర్మిస్తున్న చిన్నపిల్లల పార్కు పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి ఆదేశించారు. పార్కు అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పనుల్లో నాణ్యతను పాటిస్తూ, వేగంగా పూర్తిచేయాలన్నారు. పార్కు పూర్తయితే కొత్తపేట ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఈఈ శేషయ్య, పంచాయతీ సెక్రటరీ, తదితరులు పాల్గొన్నారు.

న్యాయాధికారులకు సన్మానం


నూతనంగా ఎంపికయిన న్యాయాధికారులను సత్కరిస్తున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి రెహానా

చీరాలటౌన్, జనవరి 12: చీరాల బార్ అసోసియేషన్ సభ్యులు న్యాయమూర్తులుగా ఎంపికయ్యారు. పాలకొల్లు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా పి.లక్ష్మీలావణ్య, తిరువూరు జూనియర్ సివిల్ న్యాయాధికారిగా ఎ.సింధూర ఎంపికయ్యారు. శుక్రవారం కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి రెహానా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, వైస్ ప్రెసిడెంట్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎడ్ల బలప్రదర్శన పోటీలు ప్రారంభం


పోటీలో బండ లాగుతున్న హైదరాబాద్ ఎడ్లు

అన్నంబొట్లవారి పాలెం(పర్చూరు), జనవరి 12: ఒంగోలు జాతి ఎడ్లు దేశానికే గర్వకారణమని ఎంఆర్‌బీ గ్రూప్ కంపెనీస్ ప్రతినిధి మాలెంపాటి రమేష్ బాబు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెం గ్రామంలో 36వ జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాలెంపాటి మాట్లాడుతూ జాతీయస్థాయిలో పోటీలు ఏర్పాటుచేయటం గర్వించతగ్గ విషయమన్నారు. తొలిరోజు జూనియర్ విభాగంలో నిర్వహించిన పోటీల్లో 8 జతల ఎడ్లు తలపడ్డాయని నిర్వాహకులు కొనకంచి సుబ్బారావు, మర్రి నాగేశ్వరరావు తెలపారు. తొలుత బరిలోకి దిగిన ఆర్ఆర్ బుల్స్ హైదరాబాద్ ఎడ్ల జత నిర్ణీత సమయం ముగిసే సరికి 3302.10 అడుగుల దూరం లాగాయి. గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం, ఎర్రగుండ్లపాడు గ్రామానికి చెందిన కల్లం షన్మిత్ కార్తీకేయరెడ్డి గిత్తలు 2549 అడుగులు, గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన నందిపాటి శ్రీజ ఎడ్లు 2409.3 అడుగుల దూరం లాగాయి.

భార్యను హత్య చేసిన భర్త అరెస్ట్

అద్దంకి, జనవరి 12: భార్యను హత్యచేసిన భర్త పొలకం రాజశేఖరరెడ్డిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు. మండలంలోని కలవ కూరులో రాజ్యలక్ష్మిని భర్త రాజశేఖరరెడ్డి రోకలిబండతో దాడిచేయగా చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త రాజశేఖరరెడ్డిని కోర్టులో హాజరు పర్చనున్నట్టు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

నాటక రంగానికి ఊపిరిపోస్తున్న కళాపరిషత్‌లు

- నటుడు, దర్శకుడు శివనారాయణ
- ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ప్రదర్శనలు


కన్నీటి కథ నాటికలోని ఓ సన్నివేశం


నటుడు, దర్శకుడు మల్లాది శివనారాయణను సత్కరిస్తున్న కళా పరిషత్ సభ్యులు

యద్దనపూడి(మార్టూరు), జనవరి 12: మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయడానికి కళాపరిషత్‌లు దిక్సూచిలాగా ఉంటాయని నటుడు, దర్శకుడు మల్లాది శివనారాయణ అన్నారు. యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో రెండో రోజు శుక్రవారం రాత్రి ఎన్టీఆర్ కళాపరిషత్ నాటికల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మల్లాది శివనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభా వేదికపైకి కందిమళ్ల సాంబశివరావు అతిథులను ఆహ్వానించారు. సభ కు కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి మల్లాది శివనారాయణ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు ఆర్థికంగా పేద ప్రజానీకానికి తోడ్పాటు అందిస్తాయన్నారు. కళాకారులు మానసికంగా ప్రజల ఆలోచనా విధానంలో మార్పునకు ప్రేరణగా నిలుస్తారన్నారు. అనంతరం శివనారాయణను కళాపరిషత్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాటకరంగ విశ్లేషకులు అంబటి మురళీకృష్ణ, ముత్తవరపు సురేష్‌బాబు, గుదే తార కరామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపచేసిన నాటికల ఇతి వృత్తాలు

శుక్రవారం రాత్రి తొలి ప్రదర్శనగా మిత్రా క్రియేషన్స్ వారు కన్నీటి కథ నాటికను ప్రదర్శించారు. వ్యవసాయం చేసే రైతు కుటుంబాలు ప్రకృతి అనుకూలించకపోవడం, నీటి కొరత, విత్తనా లు కొరత ఇంకా తదితర సమస్యలను ఎదుర్కొం టున్న తీరును కళాకారులు చక్కగా ప్రదర్శించారు. ఈ నాటికను తిలకిస్తున్నంతసేపు ప్రేక్షకులకు రోజూ గ్రామాలలో వ్యవసాయంలో రైతులు పడుతున్న పాట్లను గుర్తుకు తెచ్చాయి. అనంతరం కళాంజలి హైదరాబాదు వారు ప్రదర్శించిన రై తే రాజు నాటిక కూడా ప్రేక్షకులను ఆలోచింపజేసింది. కంప్యూటీకరణ వైపు ప్రపంచం పయనిస్తున్న సమయంలో కూడా రైతుకు తాను పండించిన పంటకు గిట్టుబాటు ధరను నిర్ణయించుకోలేని పరిస్థితులో ఉన్నాడని, ప్రభుత్వాలు మారినా రైతుల సమస్యలు మారలేదంటూ చేసిన ప్రదర్శన ఆక ట్టుకున్నది.

చివరగా అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారు ప్రదర్శించిన జరుగుతున్న కథ నాటికను తిలకించిన ప్రేక్షకుల హృదయాలు బరువెక్కాయి. వయస్సులో ఉన్నంతకాలం సంపా దించిన సొమ్మును పిల్లల కోసం ఖర్చుపెట్టి వృద్ధాప్యంలో అవసరానికి డబ్బులు లేక పిల్లలను డబ్బులు కోసం చేయిచాపడం తల్లిదండ్రులకు ఎంతో ఇబ్బందికరమని, ఎంతోకొంత సొమ్మును తమ వృద్ధాప్యం కోసం తల్లిదండ్రులు దాచుకోవాలని కళాకారులు చేసిన ప్రదర్శన దాదాపుగా ప్రతి కుటుంబంలో మనకు కనబడుతున్న సన్నివేశాలేనని ప్రేక్షకులు చ ర్చించుకున్నారు.

నేడు ప్రదర్శించనున్న నాటికలు

శనివారం రాత్రి మూడు నాటికలను ప్రదర్శించనున్నారు. తెలుగు కళాసమితి విశాఖ పట్టణం వారితో నిశబ్దమా నీఖరీదెంత , ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారితో ప్రక్షాళన, సుకృతి క్రియేషన్స్ చిలకలూరిపేట వారిచే మిణుగురు వెలుగులు నాటికలను ప్రదర్శిస్తారు.

మంచినీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు


మంచినీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అద్దంకి, జనవరి 12: మంచినీటి పైప్‌లైన్ లీకులకు మున్సిపల్ సిబ్బంది మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈనెల 9న ఆంధ్రజ్యోతిలో 'లీకులు అరికట్టేదెప్పుడో' శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. పట్టణంలోని భవాని సెంటర్‌లో మెయిన్ పైప్‌లైన్ లీకు అవుతుండటంతో నీటి విడుదల జరిగిన సమయంలో వృథాగా పోతుంది. దీంతో శుక్రవారం మున్సిపల్ సిబ్బంది పైప్‌లైన్ లీకేజలకు మరమ్మతు పనులు ప్రారంభించారు. ఒకచోట ఉన్న లీక్‌కు మరమ్మతులు చేసినప్పటికీ ఇంకా లీకు అవుతుంది. భవాని సెంటర్‌లో మెయిన్‌పైప్ లైన్ నామ్ రోడ్డును క్రాస్ చేస్తూ ఉండటంతో ఎక్కడ నుంచి లీకులు వస్తున్నాయన్న విషయం గుర్తించటం కష్టంగా మారింది. పూర్తిస్థాయిలో మరమ్మతులకు మరో రెండురోజులు సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

పర్చూరు రోటరీ క్లబ్ సేవలకు ప్రశంసలు

పర్చూరు, జనవరి 12: పర్చూరు సెంట్రల్ రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని 3150 రోటరీ గవర్నర్ భూపిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పర్చూరు రోటరీ క్లబ్‌ను ఆయన సందర్శించారు. రోటరీ గంగ ద్వారా నిర్వహిస్తున్న ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించి తగు సూచనలు చేశారు పర్చూరు రోటరీ క్లబ్ మరిన్ని సేవాకార్యక్రమాలు నిర్వహించేందుకు ఇంటర్నేషన్ రోటరీ నిధుల నుండి గ్రాండ్ రూపంలో అందజేస్తామన్నారు. జిల్లాలో మరి ఎక్కడ లేనివిధంగా రోటరీ ఆధ్వర్యంలో కుట్టుమిషన్‌ల ద్వారా మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించటం గర్వించతగ్గ విషయమన్నారు. అనంతరం ఉప్పుటూరు గ్రామం పంచాయతీకి చెత్తను తరలించేందుకు రిక్షాను అందజేశారు. కార్యక్రమంలో సహాయ గవర్నర్ ఎం.సుధీర్ కుమార్, క్లబ్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు, కార్యదర్శి పంబి సదానందరెడ్డి, సీనియర్ క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగుతున్న క్రికెట్ పోటీలు

- విజయం సాధించిన హైదరాబాద్, తిరుపతి జట్లు


మేదరమెట్ల: హైదరాబాద్, బెంగళూరు మధ్య జరుగుతున్న పోటీ

మేదరమెట్ల , జనవరి 12: రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీభమర సంక్రాంతి కప్ 2024 పోటీలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. శుక్రవారం జరిగిన పోటీలలో ప్రసాద్ జెడ్ స్పోర్ట్స్ హైదరాబాద్, తండర్ బోల్ట్ తిరుపతి జట్లు విజయం సాధించాయి. ఉదయం మెగా వారియర్స్ విజయవాడ, తండర్ బోల్ట్ తిరుపతి మధ్య జరిగిన జరిగిన పోటీలలో టాస్ గెలిచి తిరుపతి జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. మొదటి బ్యాటింగ్ చేసిన విజయవాడ జట్టు 18.2 ఓవర్లలో 103 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తిరుపతి జట్టు 9.2 ఓవర్లలోనే ఒ క వికెట్ కోల్పోయి, 108 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ జట్టులోని దినేష్‌కుమార్ 28 బంతులలో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 68 పరుగులు సాధించి నాట్‌అవుట్‌గా నిలిచాడు. తిరుపతి బౌలర్ ప్రకాష్‌రెడ్డి 4ఓవర్లలో 11 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీశాడు.

సాయంత్రం జరిగిన పోటీలలో ప్రసాద్ జెడ్ లెవెన్ హైదరాబాద్, లైన్స్ క్రికెట్ క్లబ్ బెంగుళూరు మధ్య పోటీ జరిగింది. టాస్ గెలిచిన హైదరాబాద్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 20 ఓవర్ల లో 7 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసింది. అనంతరం బ్యాంటింగ్‌కు దిగిన లైన్స్ క్రికెట్ క్లబ్ బెంగుళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 157 పరుగులు చేసింది. బెంగుళూరు జట్టు వెంటవెంటనే వికెట్లు కోల్పోవడంతో లక్ష్యాన్ని ఛేదించలేకపోయింది. నాలుగు పరుగుల తేడాతో ప్రసాద్ జెడ్ లెవన్స్ హైదరాబాద్ విజయం సాధించింది.

శనివారం ఉదయం శ్రీ సీసీ చెన్నై, వైట్ ఫీల్డ్ క్రికెట్ అకాడమీ బెంగుళూరు జట్ల మధ్య పోటీ జరుగుతుంది. సాయంత్రం ఆర్‌వైసీసీ లెవెన్ హైదరాబాద్, జీఎస్టీ సెంటల్ ఎ క్సై జ్ చెన్నై జట్ల మధ్య పోటీ జరుగుతుందని ఆర్ఎస్‌సీఏ చైర్మన్ కారుసాల నాగేశ్వరరావు(బాబు) తెలిపారు.

ఆసక్తికరంగా క్రికెట్ పోటీలు


పంగులూరు: క్రికెట్ పోటీలలో తలపడుతున్న సిరి హస్పటల్స్ ఒంగోలు, లెవెన్ బ్రదర్స్ కామారెడ్డి జట్లు

పంగులూరు, జనవరి 12: మండలంలోని కొండమంజులూరు గ్రామంలో జాతీయస్థాయి క్రికెట్ పోటీలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. శుక్రవారం ఉదయం జరిగిన మ్యాచ్ సీసీ కేరళ జట్టుపై టాస్ గెలిచిన గుజరాత్ లైన్స్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకొంది. బ్యాటింగ్ చేపట్టిన కేరళ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. ఈ జట్టులో సదన్ 48 బంతులలో 70 పరుగులు చేశాడు. 174 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ లైన్స్ 7 బంతులు మిగిలి ఉండగానే 127 పరుగులకు ఆలౌట్ అయింది. కేరళ జట్టు 46 పరుగుల తేడాతో విజయం సాధించింది. సాయంత్రం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన సిరి హాస్పటల్స్ ఒంగోలు జట్టు ఫీల్డింగ్ ఎంచుకొంది. బ్యాటింగ్ చేపట్టిన లెవెన్ బ్రదర్స్ కామారెడ్డి జట్టు 18 ఓవర్లలో 139 పరుగులకు ఆలౌట్ అయింది. 140 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన సిరి హాస్పటల్స్, ఒంగోలు 4 బంతులు మిగిలిఉండగానే 119 పరుగులకు ఆలౌట్ అయింది. ఒంగోలు జట్టుపై కామారెడ్డి జట్టు 20 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఒంగోలు జట్టులోని బౌలర్ వంశీ 16వ ఓవర్లో 3 వికెట్లు తీసుకోవడం వీక్షకులను ఆకట్టుకుంది. కామారెడ్డి జట్టు క్రీడాకారుడు జీవానంద్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా దీపక్, శ్రీనివాసనాయక్‌లు వ్యవహరించారు.

శనివారం ఉదయం చిక్కోలు చీతాస్ శ్రీకాకుళం, ఎస్ఎన్ఎంటీ తమిళనాడు జట్లు, సాయంత్రం ఎంఆర్‌సీసీ చెన్నై, మెగా లెవెన్ విజ యవాడజట్లు పోటీపడతాయని కేసీసీ చైర్మన్ కరణం స్వామి తెలిపారు.

గ్రామాల్లో సంకల్ప యాత్రలు

పంగులూరు, జనవరి 12: మండలంలోని నూజెళ్ళపల్లి, చందలూరు గ్రామాలలో వికసిత్‌భారత్ సంకల్పయాత్ర సభలు నిర్వహించారు. శుక్రవారం సర్పంచ్‌లు మద్దినేని పార్వతమ్మ, పెంట్యాల కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో ఉజ్వల యోజన, ఆయుష్మాన్‌భారత్, డ్రోన్‌ల వినియోగంతో పాటు, కేంద్ర ప్రభుత్వం మహిళలు, యువత ఉపాధికోసం అమలు చేస్తున్న పలుపథకాలు, వాటి ప్రయోజనాల గురించి వివరించారు. అర్హులైన కొందరికి ఉచిత వైద్య సదుపాయం పొందేందుకు ఉపకరించే ఆయుష్మాన్‌భారత్ కార్డులను అందజేశారు.

కార్యక్రమంలో సెంట్రల్ కోఆర్డినేటర్ పోలవరపు అనుప్రసాద్, గొల్లపాటి విజయకుమార్, డ్రోన్ పైలట్ వంశీరెడ్డి, ఎంపీడీవో బి.రామాంజనేయులు, కెనరాబ్యాంక్ మేనేజర్ దాసరి అనిల్, బీజేపీ ప్రతినిధి కొల్లి కోటేశ్వరరావు, ఉపసర్పంచ్ రవి, బి.రాంబాబు, కార్యదర్శి వందనం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేదరమెట్ల , జనవరి 12: జాతీయ రహదారిపై ద్విచక్రవాహనంపై వెళుతున్న వ్యక్తి అదుపుతప్పి కిందపడి మృతి చెందాడు. శుక్రవారం మేదరమెట్ల బైపాస్‌లో ఇంకొల్లు మండలం పావులూరుకు చెందిన గుంజి వీరయ్య(78) ఒంగోలు వైపు ద్విచక్రవాహనంపై వెళ్తూ అదుపు తప్పి కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మేదరమెట్ల ఎస్ఐ నాగశివారెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రేపు తెలుగుయువత ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు

అద్దంకి, జనవరి 12: తెలుగుయువత ఆధ్వర్యంలో పట్టణంలోని 5వ వార్డులో ఈనెల 14వ తేది ఉదయం 10 గంటలకు పిల్లలకు గేమ్స్, మధ్యాహ్నం 3 గంటలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలుగు యువత అ ద్దంకి పట్టణ అధ్యక్షుడు వడ్డవల్లి పూర్ణచంద్రరావు తెలిపారు. ముగ్గుల పోటీ లలో పాల్గొనదలిచినవారు 9398486697, 8008447275 నెంబర్‌లకు ఫో న్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.